epaper.samayamdaily.net
APTEL/26/A3949
SAMAYAM
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక
**విలేకరులు కావలెను**
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.
**7036644111, 9490140565**

సంపుటి: 1 | సంచిక: 69 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

## బాలికను బెదిరిస్తే సహించం


### బాధితురాలి భద్రతపై సుప్రీంకోర్టు సీరియస్

సీజేపీ నిరసనల్లో పాల్గొన్న బాలిక కేసుపై విచారణ

స్వతంత్ర భరద్వాజ్‌పై వేధింపులు, అదనపు సెక్షన్లు

4





4

## మోదీతో ప్రిన్స్ రహీమ్ ఖాన్ భేటీ

అభివృద్ధి భాగస్వామ్యంపై కీలక చర్చ.. ఆరోగ్యం.. వ్యవసాయం.. గ్రామీణాభివృద్ధిపై దృష్టి

# డీఎస్సీలో భారీ స్కామ్

సీబీఐ దర్యాప్తు జరిపించాలి.. లోకేశ్ రాజీనామా చేయాలి

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి



అసాధారణ అక్రమాలతో నిండిపోయిన డీఎస్సీ-2025 పై సీబీఐ దర్యాప్తు జరిపించాలని, మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీలో నిబంధనలను ఎలా తుంగలో తొక్కారో పలు ఉదాహరణలతో వివరించారు. పరీక్షలు కూడా రాయని అభ్యర్థులకు అడ్డగోలుగా ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు.

వివరాలు 2లో..

## లోకేశ్ అడ్డంగా దొరికిపోయారు!


మాజీ మంత్రి అంబటి రాంబాబు





## రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి!

### రియాక్టివ్ నుంచి ప్రో-యాక్టివ్‌కు మారాలి!



- మభ్యపెట్టే నివేదికలు వద్దు.. వాస్తవాలు చెప్పండి
- అధికారులు, మంత్రులు, జిల్లాల మధ్య పోటీ ఉండాలి
- వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్.. అదే స్వర్ణాంధ్ర
- కలెక్టర్ల సదస్సులో అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- వాటర్ మ్యాన్ ఆర్టికల్‌పై సంతోషం.. సీఎంకు స్టాండింగ్ ఓవేషన్

**అమరావతి (సమయం న్యూస్):** శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు.. ప్రభుత్వానికి రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఎనిమిదో జిల్లా కలెక్టర్ల సమావేశం గురువారం సీఎం అధ్యక్షతన ప్రారంభమైంది. తొలిరోజు సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. "గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు.. వాస్తవాలు చెప్పాలి. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది, ఓపెన్‌గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది" అని సీఎం స్పష్టం చేశారు. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలని, రియాక్టివ్

మిగతా 2 లో

## అర్హులందరికీ సొంతింటి కల సాకారం



దరఖాస్తుల పరిశీలనకు అక్టోబర్ 15 డెడ్‌లైన్

కలెక్టర్ల సదస్సులో గృహనిర్మాణంపై సీఎం సమీక్ష

2

## పాలనలో సరికొత్త వేగం

2

## అక్టోబర్ రెండున భారీ స్వచ్ఛతాన్!

పోస్టర్, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

పది లక్షల రూపాయల విలువైన బహుమతులు

ఇరవయ్యో తేదీలోగా పేర్ల నమోదుకు అవకాశం



2



2

## మద్యం కుంభకోణం తీవ్ర ఆర్థిక నేరం

- రాజ్ కేసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టులో చుక్కెదురు
- ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం
- ఈడీ, సిట్ దర్యాప్తు సమాంతరంగా సాగొచ్చని స్పష్టీకరణ

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కేసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సర్వోన్నత న్యాయస్థానంలో తీవ్ర విఘాతం ఎదురైంది.



2

## చిన్నారులకు పోషకాహార సంజీవని!

రాష్ట్రంలో కొత్తగా 21 పోషకాహార పునరావాస కేంద్రాలు

అదనంగా అందుబాటులోకి 175 పడకలు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

## సాగునీటి రంగంలో నిశ్శబ్ద విప్లవం!



3

- హంద్రీ-నీవా ప్రాజెక్టు ప్రారంభం
- పోలవరం ఎడమ కాలువ నుంచి నీటి విడుదల
- సీఎం నిబద్ధతపై మంత్రి పయ్యావుల కేశవ్ ప్రశంసలు



## దేశానికే ప్రధాన పర్యాటక కేంద్రంగా ఏపీ

విశాఖలో ఘనంగా ఐఏటీఓ వార్షిక సదస్సు!

విమాన కనెక్టివిటీ, సీప్లేన్ సేవలు పెంచుతామన్న రామ్మోహన్ నాయుడు

'ది గోదావరి కాల్స్' పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్

భారతదేశ పర్యాటక చిత్రపటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అత్యంత కీలకమైన, ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. విశాఖపట్నంలోని 'నోవాటెల్' హోటల్ వేదికగా నలభై ఒకటో 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్' (ఐఏటీఓ) వార్షిక సదస్సు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది.

.. 2లో



# అక్టోబర్ రెండున భారీ స్వచ్ఛతాన్!

**పోస్టర్, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్**

**పది లక్షల రూపాయల విలువైన బహుమతులు**

**ఇరవయ్యో తేదీలోగా పేర్ల నమోదుకు అవకాశం**

**అమరావతి (సమయం న్యూస్):** స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ రెండున విజయవాడలో భారీ స్థాయిలో నిర్వహించే 'స్వచ్ఛతాన్' పోస్టర్‌ను విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించారు. బుధవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. స్వచ్ఛతా రన్‌లో పాల్గొనే వారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు వీలుగా అమరావతిరన్నర్స్.కామ్ పోర్టల్‌ను కూడా మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, అమరావతి రన్నర్స్ అధ్యక్షుడు రమేష్ రావి తదితరులు పాల్గొన్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియం వద్ద ఆ రోజు ఉదయం ఐదు గంటలకు ఈ స్వచ్ఛతా రన్ ప్రారంభమవుతుంది. అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో ఐదు కే, పది కే, ఇరవై ఒకటి పాయింట్ ఒకటి కే (హాఫ్ మారథాన్) కేటగిరీల్లో దీనిని నిర్వహిస్తారు. బాలురు, బాలికలు, యువత సహా అన్ని వయసుల వారు ఇందులో పాల్గొనవచ్చు. పాల్గొనే వారికి టీషర్ట్‌తో పాటు అల్పాహారం ఏర్పాటు చేస్తారు. విజేతలకు పది లక్షల రూపాయల విలువైన బహుమతులతో పాటు పతకాలు, ధ్రువపత్రాలు అందజేస్తారు. ఈ స్వచ్ఛతా రన్‌లో ఆసక్తి గల వారు ఈ నెల ఇరవయ్యో తేదీ లోపల అమరావతిరన్నర్స్.కామ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంతో పాటు దేశం నలుమూలల నుంచి దాదాపు పది వేల మంది ఈ రన్‌లో పాల్గొనే అవకాశం ఉంది. విద్యార్థులు, యువతలో శారీరక దారుఢ్యం పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి, పరిశుభ్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# చిన్నారులకు పోషకాహార సంజీవని!

**రాష్ట్రంలో కొత్తగా 21 పోషకాహార పునరావాస కేంద్రాలు**

**అదనంగా అందుబాటులోకి 175 పడకలు**

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటన**

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. పిల్లల ఆరోగ్యం కోసం కొత్తగా 21 పోషకాహార పునరావాస కేంద్రాలను (ఎన్ఆర్‌సీ) ఏర్పాటు చేయబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీటి ద్వారా అదనంగా 175 పడకలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ కొత్త కేంద్రాలు దశలవారీగా వినియోగంలోకి వస్తే రాష్ట్రంలో ఎన్ఆర్‌సీల సంఖ్య 21 నుంచి 42కు, పడకల సంఖ్య 340 నుంచి 515కు పెరుగుతాయని ఆయన వివరించారు.



ఇంతకుముందు మంజూరైన ఎనిమిది 10 పడకల కేంద్రాలు అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరకు, ముంచింగిపుట్, చింతపల్లి, అనకాపల్లి, బాపట్ల, నంద్యాల, సున్నిపెంట, పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో రానున్నాయి. వీటిలో అరకు, నంద్యాల కేంద్రాల్లో పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, త్వరలోనే ఇవి వినియోగంలోకి వస్తాయని మంత్రి తెలిపారు. మిగతా చోట్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. గిరిజన ప్రాంతాల్లో పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఏడు ఇంటిగ్రేటెడ్ ఎన్ఆర్‌సీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. అడ్డతీగల, వై.రామవరం, సాలూరు, పాలకొండ, భద్రగిరి, కురుపాం, చినమేరంగిలో ఇవి రానున్నాయి. వీటిలో అడ్డతీగల, వై.రామవరం కేంద్రాలను త్వరలో ప్రారంభించనున్నారు. వీటికి అదనంగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో మరో ఆరు 10 పడకల ఎన్ఆర్‌సీలను ప్రభుత్వం మంజూరు చేసిందని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె, చిత్తూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, హిందూపురం, తణుకులో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

# సాగునీటి రంగంలో నిశ్శబ్ద విప్లవం!

**హంద్రీ-నీవా ప్రాజెక్టు ప్రారంభం**

**పోలవరం ఎడమ కాలువ నుంచి నీటి విడుదల**

**సీఎం నిబద్ధతపై మంత్రి పయ్యావుల కేశవ్ ప్రశంసలు**

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలోని ప్రతి రైతుకు, ప్రతి కుటుంబానికి నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో సాగునీటి రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆయన చూపుతున్న నిబద్ధతను గుర్తిస్తూ కలెక్టర్ల సదస్సులో మంత్రులు, జిల్లా కలెక్టర్లు ముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించారు. అందరూ నిలబడి చప్పట్లతో ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సదస్సులో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రంలో సాగునీటి రంగంలో ఒక నిశ్శబ్ద విప్లవం కొనసాగుతోందని ప్రశంసించారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు ప్రారంభం, పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి నీటి విడుదల లాంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ గమనించారన్నారు. అయితే పలు సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ముందుకు తీసుకెళ్లేందుకు ఒక వ్యక్తిగా చంద్రబాబు నాయుడు రాత్రింబవళ్లు శ్రమిస్తూ చూపిన కృషిని, నిబద్ధతను మాత్రం ఎవరూ గమనించలేదని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని (బిందు సేద్యం) ప్రవేశపెట్టిన ఘనత కూడా చంద్రబాబు నాయుడికే దక్కుతుందని మంత్రి పయ్యావుల ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి!

(మొదటిపేజీ తరువాయి..)

గవర్నెన్స్ నుంచి ప్రో-యాక్టివ్ గవర్నెన్స్‌కు మారాలని సీఎం పిలుపునిచ్చారు. "వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర. అభివృద్ధి విషయంలో శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి. ఈగోలు పక్కనపెట్టి ప్రజా సేవకులుగా ఉందాం" అని సూచించారు. కాలం మారిందని, కేవలం పనిచేస్తేనే సరిపోదని, ప్రభుత్వ బద్నాం కోసం చేసే ఫేక్ ప్రచారాలకు దీటుగా కౌంటర్ ఇవ్వాల్సిన అవసరం కూడా ఉందన్నారు. కొన్ని చోట్ల లీడర్షిప్ లోపం ఉందని, దానిపై ఈ సదస్సులో ప్రత్యేకంగా చర్చించాలన్నారు. గత 27 నెలల వ్యవధిలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టామని, అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశామని సీఎం వివరించారు.




### వాటర్ మ్యాన్‌గా పేరు రావడం సంతోషం..

నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి ప్రముఖ పత్రిక ఎకనమిక్ టైమ్స్ సీఈఓ టు వాటర్ మ్యాన్ అంటూ తనపై రాసిన కథనం సంతోషం కలిగించిందని సీఎం అన్నారు. "సమస్యాత్మక ప్రాంతాలకు నీరు ఇవ్వగలిగితే కలిగే సంతోషం వేరు. 36 ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు క్యాలెండర్ ఇచ్చాం, వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని చెప్పారు. ఈ కథనంపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సదస్సులో ప్రత్యేకంగా ప్రస్తావించారు. నీటి వనరుల రంగంలో రాష్ట్రం సాధించిన విజయాలను దేశం గుర్తించిందన్నారు. సీఎం కృషిని అభినందిస్తూ కాన్ఫరెన్స్‌లో అధికారులు, మంత్రులు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సదస్సులో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాలనలో సరికొత్త వేగం!

- నాయకత్వంలో కొత్త ఆలోచనా విధానంతో ముందుకు సాగాలి
- న్యూ ఏజ్ గవర్నెన్స్‌తోనే స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన
- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి (సమయం న్యూస్):** నాయకత్వంలో కొత్త ఆలోచనా విధానంతో, పాలనలో సరికొత్త వేగంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో నిర్వహిస్తున్న 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో లీడర్షిప్‌ఉన్యూ ఏజ్ గవర్నెన్స్ అంశంపై ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం లీడర్షిప్ ట్రాన్సిషన్‌లో ఉన్నామని, న్యూ లీడర్షిప్ అప్రోచ్‌తో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాయకత్వం అనేది సెల్ఫ్ మోటివేషన్‌తో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. టెక్నాలజీ యుగంలో నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మారిందని, నైపుణ్యానికి ఎంత పదును పెడితే అంత ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఫైల్స్, డేటా లేక్ వంటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా చూసుకుంటూ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు.

### ఇమిడిపోయే తత్వం భారతీయులది..

బ్యూరోక్రసీకి, రాజకీయ నేతలకు వేర్వేరు నైపుణ్యాలు ఉండాల్సిందేనని సీఎం పేర్కొన్నారు. నాయకుడు తన బృందాన్ని ఎంత ప్రభావవంతంగా నిర్మిస్తారన్నదే అంతిమ ఫలితాలను నిర్ణయిస్తుందని తెలిపారు. ఏ వ్యవస్థలో అయినా ఇమిడిపోయే తత్వం భారతీయుల సొంతమని, దానికి అనుగుణంగా మనమూ ఉండాలని సూచించారు. ప్రపంచంలోనే భారతీయ ఎంట్రప్రెన్యూర్లు అత్యుత్తమంగా ఉన్నారని, అనేక ప్రతిష్ఠాత్మక కంపెనీలకు వారే సారథ్యం వహిస్తున్నారని సీఎం గుర్తుచేశారు. మహిళలుఉపురుషులు అనే వ్యత్యాసం గత కాలపు నినాదమని, ఇప్పుడు ఆ తేడా లేదన్నారు. ఉద్యోగ వ్యవస్థలే మారిపోతున్న ప్రస్తుత తరుణంలో, ఏ రంగంలోనైనా క్రెడిబిలిటీ అనేదే కీలకమని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమను తాము ఎప్పటికప్పుడు మార్చుకోవాలని సూచించారు. నూతన నాయకత్వ విధానంతో పనిచేయడం ద్వారా వేగంగా ఫలితాలను సాధించడంతో పాటు 'స్వర్ణాంధ్ర' విజన్ లక్ష్యాలను చేరుకునేందుకు సులభంగా ఆస్కారం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు.

# అర్హులందరికీ సొంతింటి కల సాకారం!

- దరఖాస్తుల పరిశీలనకు అక్టోబర్ 15 డెడ్‌లైన్
- కలెక్టర్ల సదస్సులో గృహనిర్మాణంపై సీఎం సమీక్ష
- పంపిణీ, క్రమబద్ధీకరణ జాబితాలు సిద్ధం చేయాలని స్పష్టీకరణ

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి స్థలం అందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇళ్ల పట్టాల పంపిణీ, గృహ నిర్మాణాలపై పరిమిత సమయం పెట్టుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ అంశాలకు సంబంధించి పది రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని రావాలని ఆదేశించారు. ఎనిమిదో జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, స్థలాల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఎంతమందికి కొత్తగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలి, ఎంతమందికి పట్టాలను క్రమబద్ధీకరించాలనే అంశాలపై స్పష్టమైన జాబితాను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. కాగా, ప్రస్తుతం 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ఆయనకు వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తుల పరిశీలనను వచ్చే నెల 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 1,692 గ్రామాల్లో 18 వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు భూమిని గుర్తించినట్లు వెల్లడించారు. ఈ నివేదికలపై స్పందించిన సీఎం.. ఇళ్ల పట్టాల పంపిణీ ప్రక్రియ మొత్తాన్ని ఏడాదిలోపు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు.

### మార్చి నాటికి గృహాల పూర్తి..

రాష్ట్రంలో గృహ నిర్మాణాల పురోగతిపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మరో 5.32 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అధికారులు తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నింటినీ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియలో జాప్యానికి తావులేకుండా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని, అర్హుల గుర్తింపు నుంచి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి దశనూ నిర్దేశిత కాలపరిమితిలో పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# మద్యం కుంభకోణం తీవ్ర ఆర్థిక నేరం!

**రాజ్ కేసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టులో చుక్కెదురు**

**ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం**

**ఈడీ, సిట్ దర్యాప్తు సమాంతరంగా సాగొచ్చని స్పష్టీకరణ**



**అమరావతి (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కేసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సర్వోన్నత న్యాయస్థానంలో తీవ్ర విఘాతం ఎదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. ఈ సందర్భంగా కేసు తీవ్రతను ప్రస్తావించిన న్యాయస్థానం.. ఇది అత్యంత తీవ్రమైన ఆర్థిక నేరమని వ్యాఖ్యానించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన ఆర్థిక అక్రమాల కేసుతో పాటు రాష్ట్ర పోలీసుల ప్రత్యేక విచారణ బృందాల (సిట్, సీఐడీ) దర్యాప్తు ఒకే సమయంలో సమాంతరంగా సాగడంలో ఎటువంటి తప్పులేదని కోర్టు తేల్చిచెప్పింది. నిందితులు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నారని న్యాయవాదులు తెలుపగా, ఆ కస్టడీ పూర్తయిన తక్షణమే వారిని సిట్ కస్టడీకి అప్పగించేలా ప్రొడక్షన్ వారెంట్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం, సిట్ విచారణ ప్రక్రియ ముగిసిన అనంతరం నిందితులు సంబంధిత కింది కోర్టులోనే రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. కేసుకు సంబంధించిన పూర్తి అంశాలు, మెరిట్స్ ఆధారంగా మాత్రమే ఆ బెయిల్ దరఖాస్తును కింది కోర్టు పరిశీలిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



# దేశానికే ప్రధాన పర్యాటక కేంద్రంగా ఏపీ

- విశాఖలో ఘనంగా ఐఏటీఓ వార్షిక సదస్సు!
- విమాన కనెక్టివిటీ, సీప్లేన్ సేవలు పెంచుతామన్న రామ్మోహన్ నాయుడు
- 'ది గోదావరి కాల్స్' పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్

**విశాఖపట్నం (సమయం న్యూస్):** భారతదేశ పర్యాటక చిత్రపటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అత్యంత కీలకమైన, ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. విశాఖపట్నంలోని 'నోవాటెల్' హోటల్ వేదికగా నలభై ఒకటో 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్' (ఐఏటీఓ) వార్షిక సదస్సు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

### గోదావరి కాల్స్..

సదస్సు ప్రారంభ సూచికగా ఐఏటీఓ మాన్యువల్ బుక్‌ను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం 2027లో జరగబోయే గోదావరి పుష్కరాల విశిష్టతను తెలుపుతూ పర్యాటక శాఖ రూపొందించిన ప్రతిష్టాత్మక 'ది గోదావరి కాల్స్' పోస్టర్‌ను మంత్రి కందుల దుర్గేష్ విడుదల చేశారు. దేశ విదేశాల నుంచి విచ్చేసిన టూర్ ఆపరేటర్లు ఏపీని సందర్శించి ఇక్కడి సంస్కృతితో మమేకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించాలని సూచించారు. ఏపీ పర్యాటక ప్రతినిధులకు ఐఏటీఓ నమోదులో ఉచిత రిజిస్ట్రేషన్ కల్పించినట్లు తెలిపారు.

### కొత్త విమానాశ్రయాలు, సీప్లేన్ సేవలు..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విశాఖపట్నంతో పాటు రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాలకు విమాన అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు. కొత్త విమానాశ్రయాల ఏర్పాటుతో పాటు సీప్లేన్ సేవలను సైతం త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చి పర్యాటకుల ప్రయాణాలను సులభతరం చేస్తామని ప్రకటించారు. ఏపీ పర్యాటకాభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ టీడీసీ చైర్మన్ నీలూ శర్మ, ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ పట్టాన్ శెట్టి రవి సుభాష్, విశాఖ కలెక్టర్ విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీలో భారీ స్కామ్

- సీబీఐ దర్యాప్తు జరిపించాలి.. లోకేశ్ రాజీనామా చేయాలి
- నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో ఉద్యోగాల పందేరం
- పరీక్షలు రాయని వారికీ పోస్టింగులా?
- కుమారుడిని రక్షించేందుకే చంద్రబాబు ఆపసోపాలు
- మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి



**తాడేపల్లి (సమయం న్యూస్):** జరగని క్రీడా పోటీల్లో పాల్గొన్నట్లు చూపించే పార్టిసిపేషన్ సర్టిఫికెట్ల ఆధారంగా స్పోర్ట్స్ కోటాలో మొత్తం 39 ఉద్యోగాలు ఇచ్చారని జగన్ విమర్శించారు. కొందరు ఖమ్మంలో ఎప్పుడూ జరగని టోర్నమెంట్‌లో పాల్గొన్నట్లు సర్టిఫికెట్లు సమర్పించారని తెలిపారు. అసలు పోటీలే జరగలేదని తెలంగాణ జూడో అసోసియేషన్ స్పష్టం చేసినా.. ఏపీ జూడో అసోసియేషన్ నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చిందని ఆరోపించారు. ఆ సంఘానికి లోకేశ్ బావమరిది భారత్ అధ్యక్షుడిగా ఉన్నారని గుర్తుచేశారు. సాఫ్ట్‌బాల్ సంఘంలోనూ ఇలాంటి అక్రమాలే జరిగాయని ఆరోపించారు. నల్గొండలో జరిగినట్లు పేర్కొన్న ఖో-ఖో ఛాంపియన్‌షిప్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పతకాలు సాధించినట్లు చూపించి ఉద్యోగాలు కొట్టేశారన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి టెట్ పరీక్ష రాయకుండానే ఉద్యోగం పొందారని జగన్ ఆరోపించారు. రిజర్వేషన్ కేటగిరీ కింద 75 మార్కులు సాధించాల్సి ఉండగా.. 65 మార్కులకే ఉద్యోగం ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్ష నిర్వహణ బాధ్యతను ఒకే వ్యక్తికి అప్పగించడంతోనే ఈ కుంభకోణానికి బీజం పడిందని విమర్శించారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రశ్నపత్రం ముందే లీక్ అవడంతో అతనే మొదటి ర్యాంక్ సాధించాడని ఆక్షేపించారు. ఏపీపీఎస్సీ ద్వారా అటవీ శాఖలో పోస్టులు భర్తీ చేసేందుకు కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని చూశారని, తాము అడ్డుకోవడంతో వెనక్కి తగ్గారని ఆరోపించారు.

### కొడుకును కాపాడేందుకే..

కుమారుడు లోకేశ్‌ను కాపాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని జగన్ ఆరోపించారు. అసెంబ్లీలో కూడా ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఏడుసార్లు వెరిఫికేషన్ చేశామని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉద్యోగాలు అమ్మకానికి ఉన్నాయనేందుకు ఆడియో, వీడియో ఆధారాలున్నా చర్యలు శూన్యమన్నారు. అక్రమాలతో వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోతుండటంతో న్యాయస్థానాల్లో పోరాడుతున్నామని జగన్ స్పష్టం చేశారు. ఎంతో కష్టపడి చదివే యువతపై ఇలాంటి వ్యవహారాలు తీవ్ర ప్రభావం చూపుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# లోకేశ్ అడ్డంగా దొరికిపోయారు!

**డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల్లో భారీగా అవకతవకలు**

**తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలి**

**వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఫైర్**



**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఎన్నడూ లేనంత స్థాయిలో భారీ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ఈ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయారని ఆయన ఆరోపించారు. డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం మౌనం వహిస్తోందని, లోకేశ్‌కు మంత్రి పదవిలో కొనసాగే అర్హత, హక్కు రెండూ లేవని మండిపడ్డారు. ఈ మొత్తం నియామక అక్రమాలపై తక్షణమే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్సీపై ప్రతిపక్షాలు, అభ్యర్థులు ఆధారాలతో సహా ప్రశ్నిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ మత్తు ఇంజెక్షన్లు తీసుకున్నట్లు మౌనం పాటిస్తున్నారని అంబటి విమర్శించారు. ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఐఏఎస్ అధికారులను ముందు ఉంచి మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. లోకేశ్ ఉద్యోగాలను బజ్జీలు అమ్మినట్లు మార్కెట్లో అమ్మేశారని, ఆయన దొరికిపోయిన దొంగ అని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. రాజకీయాలకు, మంత్రి పదవికి ఏమాత్రం పనికిరారని దుయ్యబట్టారు. లోకేశ్‌ను భవిష్యత్తులో ముఖ్యమంత్రిని చేయాలని చూస్తున్నారని, ఒకవేళ ఆ పదవి ఇస్తే ఏకంగా రాష్ట్రంతో పాటు దేశాన్నే అమ్మేస్తారని ఎద్దేవా చేశారు. లోకేశ్ వైఖరి వల్లే టీడీపీ సర్వనాశనం కాబోతోందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే జరిగిన డీఎస్సీలోనే వందలాది పోస్టులు అక్రమాలకు గురయ్యాయని, మళ్లీ మరో రెండు డీఎస్సీలు నిర్వహిస్తామని ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆడుకున్న లోకేశ్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని అంబటి డిమాండ్ చేశారు.

# నియంత్రణల సడలింపే సంస్కరణలకు కీలకం!

- గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్-2026లో నీతి ఆయోగ్ సభ్యుడు రాజీవ్ గౌబా
- చట్టాలు, నిబంధనలను సమగ్రంగా సమీక్షించాలి
- యూపీఐ, ఆధార్ వ్యవస్థలు ప్రపంచానికే ఆదర్శం



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** భారత ఆర్థిక వ్యవస్థలో తదుపరి తరం సంస్కరణలకు డీ-రెగ్యులేషన్ (నియంత్రణల సడలింపు) ప్రధాన లక్షణంగా ఉండాలని నీతి ఆయోగ్ సభ్యుడు రాజీవ్ గౌబా అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలో జరిగిన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్-2026'లో ఆయన మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపనకు అవసరమైన లైసెన్సులు, అనుమతులు, తరచూ పునరుద్ధరణలు లాంటి సంక్లిష్ట ప్రక్రియలను తగ్గించాలని సూచించారు. ప్రస్తుత చట్టాలు, నిబంధనలు, పరిపాలనా విధానాలను సమగ్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జీఎస్టీ, దివాలా-దివాళా పరిష్కార చట్టం, విదేశీ పెట్టుబడుల సరళీకరణ తదితర సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయని గౌబా తెలిపారు. ఆధార్, యూపీఐ, డిజిలాకర్, అకౌంట్ అగ్రిగేటర్ లాంటి వ్యవస్థలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ఫిన్‌టెక్ రంగంలో ప్రజా ప్రయోజనాల రక్షణతో పాటు కొత్త ఆవిష్కరణలకు అవకాశం కల్పించే సమతుల్య నియంత్రణ అత్యంత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు అందరూ సమష్టిగా కృషి చేయాలని రాజీవ్ గౌబా పిలుపునిచ్చారు.

# డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావుకు ఘన సన్మానం!

**మాస్ మీడియా టీం ఆధ్వర్యంలో కార్యక్రమం**

**శకట ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించినందుకు అభినందనలు**

**పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని అధికారులకు సూచన**



**ఒంగోలు (సమయం న్యూస్):** ప్రకాశం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) ఎస్. వెంకటేశ్వరరావును వైద్యారోగ్య శాఖలోని మాస్ మీడియా సెక్షన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో నిర్వహించిన వివిధ శాఖల శకటాల ప్రదర్శనలో వైద్యారోగ్య శాఖ శకటానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ విజయానికి కృషి చేసిన సాంస్కృతిక బృందాన్ని, కల్చరల్ విద్యార్థులను అభినందిస్తూ మాస్ మీడియా విభాగం డెమో బి. నరసింహారావు అధ్యక్షతన బుధవారం ఒక కార్యక్రమం జరిగింది. శకటానికి ప్రథమ బహుమతి రావడంలో డీఎంహెచ్‌వో, అదనపు డీఎంహెచ్‌వోల కృషి ఎంతో ఉందని, సిబ్బందిని ప్రోత్సహించే ఇలాంటి అధికారులు ఉండటం గర్వకారణమని మాస్ మీడియా టీం సభ్యులు కొనియాడారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది అంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, డిప్యూటీ డెమో కె.ఎ. రాజు, సిబ్బంది కృష్ణారావు, పవన్, ఆశా కార్యకర్తలు, చైతన్య నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు!

**జిల్లాస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం**

**నిర్ణీత గడువులోగా ధ్రువీకరణ పత్రాలు పొందాలి**

**ఏర్పాట్లపై మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ ప్రకటన**

**అమరావతి (సమయం న్యూస్):** పవిత్ర హజ్ యాత్ర-2027కు దరఖాస్తు చేసుకుని ఎంపికైన హాజీలకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మైనార్టీ, న్యాయ శాఖల మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ఎంపికైన యాత్రికులు తప్పనిసరిగా నిర్దేశిత వైద్య పరీక్షలు చేయించుకుని, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉంటుందని అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఈ ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు (డీఎంహెచ్‌వోలు) రాష్ట్ర హజ్ కమిటీ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. వివిధ జిల్లాల నుంచి ఎంపికైన హజ్ యాత్రికులకు ఆయా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. అధికారిక ప్రభుత్వ అల్లోపతి వైద్య అధికారులు ఈ నిర్దేశిత వైద్య పరీక్షలు నిర్వహించి, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా సూచించిన నమూనాలో ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారని మంత్రి స్పష్టం చేశారు. యాత్రికులు నిర్ణీత గడువులోగా ఈ పరీక్షలు పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.




# రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి పెట్టుబడులే కీలకం!

**జిల్లా కలెక్టర్ల సదస్సులో ఐటీ, ఈఅండ్‌సీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్**

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఐటీ, జీసీసీ, ఎలక్ట్రానిక్స్ మరియు సెమీకండక్టర్ రంగాల్లో పెట్టుబడులు వేగంగా వస్తున్నాయని, ఈ రంగాలను ఆర్థికాభివృద్ధికి ప్రధాన వృద్ధి ఇంజిన్లుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఐటీ, ఈఅండ్‌సీ (ఐ,ఇ&ఐ) శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సూచించారు. గురువారం జరిగిన ఎనిమిదో కలెక్టర్ల సదస్సులో ఆయన ఈ రంగాల పురోగతిని వివరించారు. రాష్ట్రంలో 2030 నాటికి 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.



### కొత్త ఐటీ పార్కుల అభివృద్ధి..

డేటా సెంటర్ ప్రాజెక్టులకు అవసరమైన భూముల సమీకరణను వేగవంతం చేయాలని, ఆమోదిత ప్రాజెక్టులకు పవర్ గ్రిడ్, వాటర్ గ్రిడ్ మాస్టర్ ప్లాన్లను రూపొందించాలని కాటమనేని భాస్కర్ కోరారు. ఈ ప్రాజెక్టుల అమలుకు విశాఖపట్నం, అనకాపల్లి కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విశాఖలో ఐటీ, జీసీసీ రంగ అభివృద్ధికి 1-5 ఎకరాల ప్లాట్లతో ఐటీ పార్కులను అభివృద్ధి చేయాలని, ఇందుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి అవసరమని తెలిపారు. ఎంబసీ గ్రూప్, పంచ్‌శీల్ తదితర సంస్థల కోసం తక్షణమే 100 ఎకరాల భూమిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

### విశాఖ, అమరావతి, రాయలసీమకు మాస్టర్ ప్లాన్..

ప్రాంతీయ ప్రత్యేకతలను వినియోగించుకునేందుకు విశాఖపట్నం, అమరావతి, రాయలసీమ ప్రాంతాలకు ఎకనామిక్ గ్రోత్ మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు నిప్పన్ కోయ్ సంస్థను నియమించినట్లు ఆయన తెలిపారు. విశాఖలో ఐటీ / ఐటీఈఎస్, రాయలసీమలో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్, ఏవీజీసీ రంగాలను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. క్వాంటమ్ టెక్నాలజీలో ఏపీని జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, అక్టోబర్ 15 నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ (క్యూసీసీ1)ను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్ ఆధారిత రంగాల్లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేలా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని కాటమనేని భాస్కర్ కోరారు.

# డాక్టర్ వెంకట మోహన్‌కు ఇన్సా ఫెలోషిప్!

**సీఎస్ఐఆర్-నీరీ డైరెక్టర్‌గా సేవలు**

**పర్యావరణ రంగంలో విశేష కృషికి గుర్తింపు**

**450కి పైగా పరిశోధనా వ్యాసాల ప్రచురణ**

**హైదరాబాద్ (సమయం న్యూస్):** హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్‌ఉఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్, ప్రస్తుతం సీఎస్ఐఆర్‌ఉనీరీ (నాగ్‌పూర్) డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. వెంకట మోహన్ ప్రతిష్ఠాత్మక ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఇన్సా) ఫెలోగా ఎన్నికయ్యారు. పర్యావరణ ఇంజినీరింగ్, పర్యావరణ బయోటెక్నాలజీ, సస్టైనబిలిటీ ఇంజినీరింగ్ రంగాల్లో ఆయన చేసిన విశిష్ట పరిశోధనలకు గుర్తింపుగా ఈ అరుదైన గౌరవం లభించింది. వ్యర్థ జల శుద్ధి, రిసోర్స్ రికవరీ, బయోఎలక్ట్రోకెమికల్ సిస్టమ్స్, సర్క్యులర్ బయోరిఫైనరీలు, డీకార్బనైజేషన్ రంగాల్లో డాక్టర్ వెంకట మోహన్ విశేష కృషి చేశారు. తన వృత్తిగత జీవితంలో ఆయన ఇప్పటి వరకు 450కి పైగా పరిశోధనా వ్యాసాలు ప్రచురించగా, 16 పేటెంట్లు పొందారు. 47 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. ఆయన పరిశోధనలకు ఏకంగా 42,000కు పైగా సైటేషన్లు లభించగా, హెచ్-ఇండెక్స్ 110గా ఉండటం విశేషం.

# ఇంధన ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై ప్రత్యేక దృష్టి!

**కలెక్టర్లకు ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్ దిశానిర్దేశం**

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలో ఆమోదం పొందిన ఇంధన ప్రాజెక్టుల పెట్టుబడులను వేగంగా వాస్తవ ప్రాజెక్టులుగా మార్చేందుకు కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సూచించారు. గురువారం జరిగిన ఎనిమిదో జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన రాష్ట్ర ఇంధన రంగానికి సంబంధించి ఎస్ఐపీబీ ఆమోదించిన పెట్టుబడుల పురోగతిని సమీక్షించారు. అక్టోబర్ చివరి నాటికి కనీసం 80 శాతం ప్రాజెక్టుల గ్రౌండింగ్ సాధించడమే లక్ష్యంగా కలెక్టర్లు, నెడ్‌క్యాప్ నోడల్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని కోరారు. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 93 ఇంధన ప్రాజెక్టులకు రూ.4.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, 4.72 లక్షల ఉపాధి అవకాశాలతో భూకేటాయింపులు జరిగాయని విజయానంద్ తెలిపారు. వీటిలో భారీగా సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు. ఈ 93 ప్రాజెక్టుల్లో 33 ఇప్పటికే గ్రౌండింగ్, కమిషనింగ్ దశకు చేరుకున్నాయని, మిగిలిన 54 ప్రాజెక్టులను వేగంగా గ్రౌండింగ్ చేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా శ్రీ సత్యసాయి జిల్లాలో 9, కడపలో 6, అనంతపురంలో 11 ప్రాజెక్టులు గ్రౌండ్ చేయాల్సి ఉందని, ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ ప్రాజెక్టులపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. ప్రాజెక్టులకు అవసరమైన భూముల జాయింట్ సర్వే, ప్రత్యామ్నాయ భూముల గుర్తింపు, అప్రోచ్ రోడ్లు, నీటి పైప్‌లైన్లు, రైట్ ఆఫ్ వే (=శిఔ) సమస్యలు, స్థానిక అనుమతులను జిల్లా స్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఏపీ ఐసీఈ పాలసీ-2024 కింద ఆరు ప్రాజెక్టులు రూ.11,284 కోట్ల పెట్టుబడితో ప్రారంభమయ్యాయని వివరించారు.

# లక్ష రూపాయల విలువైన వాటర్ ప్లాంట్ అందజేత

**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 10:** కడకట్లలో బీవీకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఆర్ గోయింకా డిగ్రీ కళాశాలకు బిజెపి నర్సాపురం మీడియా కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు తన తండ్రి నరిసే వీర్రాజు జ్ఞాపకార్థం లక్ష రూపాయల విలువైన వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన, శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ వాటర్ ప్లాంట్‌ను కళాశాలకు అందించడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈతకోట తాతాజీ ప్రముఖ వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి, సుంకవల్లి రామకృష్ణ జీఎంఆర్ విద్యా సంస్థల అధినేత గ్రంధి సత్యనారాయణ హాజరయ్యారు.

## సంపాదకీయం



# ప్రైవేటీకరణకే మొగ్గు?

**ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనలు**

**అంతరిక్ష రంగంలో పెరుగుతున్న ప్రైవేట్ భాగస్వామ్యం**

**కీలక కార్యకలాపాల బదిలీపై సందేహాలు**

**ఇస్రో కేంద్ర పాత్ర దెబ్బతినకూడదనే ఆందోళన**

**పరిశోధన, వ్యూహాత్మక నియంత్రణ ప్రభుత్వానిదే కావాలి**

**ప్రైవేట్ పెట్టుబడులు అవసరమే.. ఇస్రోను బలిపెట్టొద్దు**

అంతరిక్ష పరిశోధనలో భారత్‌ను ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిపిన సంస్థ ఇస్రో. పరిమిత వనరులతోనే అసాధారణ విజయాలు సాధిస్తూ దేశ శాస్త్రసాంకేతిక సామర్థ్యానికి ప్రతీకగా నిలిచింది. చంద్రయాన్ నుంచి మంగళయాన్ వరకు, ఉపగ్రహ ప్రయోగాల నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు భారత్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. అలాంటి ఇస్రో భవిష్యత్తు ఇప్పుడు కొత్త చర్చకు కేంద్రబిందువుగా మారుతోంది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థలకు పెరుగుతున్న అవకాశాలతో.. ఇస్రోను కూడా క్రమంగా ప్రైవేటీకరణ వైపు నడిపిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని చెబుతున్నప్పటికీ, అంతరిక్ష రంగంలో అమలవుతున్న విధాన మార్పులపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, ప్రయోగ సేవలు వంటి కార్యకలాపాల్లో ప్రైవేట్ రంగానికి విస్తృత అవకాశాలు కల్పిస్తున్నారు. ఒకప్పుడు ప్రధానంగా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగిన అంతరిక్ష రంగంలో ఇప్పుడు ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరుచుకున్నాయి.

### ప్రైవేట్ భాగస్వామ్యం తప్పు కాదు.. కానీ!

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించడాన్ని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతోంది. కొత్త పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, ఉపాధి అవకాశాలు, వేగవంతమైన ఆవిష్కరణలకు ప్రైవేట్ రంగం దోహదపడగలదు. అయితే భాగస్వామ్యానికి, ప్రభుత్వ సంస్థ కేంద్ర పాత్రను బలహీనపరచడానికి మధ్య స్పష్టమైన గీత ఉండాలి. అమెరికాలో నాసా ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నప్పటికీ కీలక పరిశోధనలు, అంతరిక్ష కార్యక్రమాల దిశానిర్దేశంలో తన ప్రధాన పాత్రను కొనసాగిస్తోంది. భారత్‌లోనూ ఇస్రో విషయంలో అదే సూత్రాన్ని పాటించాల్సిన అవసరం ఉంది.

### కొత్త వ్యవస్థలు.. కొత్త సందేహాలు


అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు ఇన్-స్పేస్, వాణిజ్య కార్యకలాపాల కోసం ఎన్ఎస్ఐఎల్ వంటి వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా ప్రైవేట్ రంగానికి అవకాశాలు విస్తరించడం అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు ఉపయోగపడవచ్చు. అదే సమయంలో ఇస్రో పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాలు మరింత బలోపేతం కావాలి తప్ప తగ్గకూడదు. ప్రైవేట్ సంస్థలకు ఏ కార్యకలాపాలు అప్పగిస్తారు? ఇస్రో వద్ద ఏ వ్యూహాత్మక బాధ్యతలు కొనసాగుతాయి? సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి హద్దులేమిటి? జాతీయ భద్రతకు సంబంధించిన అంతరిక్ష వ్యవస్థలపై నియంత్రణ ఎవరి చేతుల్లో ఉంటుంది? వంటి అంశాల్లో పూర్తి పారదర్శకత అవసరం. ఇస్రో అంటే కేవలం రాకెట్లు, ప్రయోగ కేంద్రాలు, ఉపగ్రహాలు మాత్రమే కాదు. దశాబ్దాలుగా దేశం నిర్మించుకున్న శాస్త్రీయ విజ్ఞానం, అనుభవం, వేలాది మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల మేధోసంపత్తి దాని అసలు బలం. ఆ మానవ వనరులను కాపాడుకోవడం అత్యంత కీలకం. ప్రైవేట్ రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు బయటకు వెళ్లకుండా ఇస్రోలో పరిశోధనకు మరింత స్వేచ్ఛ, తగిన ప్రోత్సాహం, ఆధునిక సదుపాయాలు, అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ సంస్థను బలహీనపరిచి ప్రైవేట్ రంగాన్ని బలోపేతం చేయడం కాకుండా.. రెండింటి సామర్థ్యాలు దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానమే అవసరం. భారత అంతరిక్ష మార్కెట్ విస్తరిస్తున్న కొద్దీ దేశీయ, అంతర్జాతీయ ప్రైవేట్ సంస్థలు సహజంగానే ఆసక్తి చూపుతాయి. ఇందులో తప్పేమీ లేదు. కానీ కొద్దిమంది పెద్ద కార్పొరేట్ సంస్థల చేతుల్లోనే అవకాశాలు కేంద్రీకృతమయ్యే పరిస్థితి ఏర్పడకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించాలి. స్టార్టప్‌లు, చిన్న, మధ్యతరహా సాంకేతిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు కూడా సమాన అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ నిధులతో దశాబ్దాలుగా అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం బదిలీలో ప్రజా ప్రయోజనమే ప్రధాన ప్రమాణంగా ఉండాలి.

### ఇస్రో కేంద్ర పాత్ర చెక్కుచెదరకూడదు

అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్ పెట్టుబడులకు తెరవడం ఒక విధాన నిర్ణయం. దాన్ని నేరుగా 'ఇస్రో ప్రైవేటీకరణ'గా పేర్కొనడం సరైంది కాదు. అదే సమయంలో ప్రైవేట్ రంగ విస్తరణ పేరుతో ఇస్రో పరిశోధన సామర్థ్యం, స్వతంత్రత, వ్యూహాత్మక ప్రాధాన్యం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. భవిష్యత్తు అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రైవేట్ సంస్థలకు స్థానం ఉండాలి. కానీ పరిశోధన, ఆవిష్కరణ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన వ్యూహాత్మక దిశానిర్దేశంలో ఇస్రోనే కేంద్రంగా కొనసాగాలి. ప్రైవేట్ సంస్థలు పోటీదారులుగా కాకుండా దేశ అంతరిక్ష సామర్థ్యాన్ని పెంచే భాగస్వాములుగా ఎదగాలి. ప్రైవేట్ పెట్టుబడులు రావాలి.. అంతరిక్ష రంగం విస్తరించాలి.. కొత్త ఉద్యోగాలు పుట్టాలి.. భారత కంపెనీలు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడాలి. కానీ ఆ ప్రయాణంలో దేశం దశాబ్దాలుగా నిర్మించుకున్న ఇస్రోను బలహీనపరిచే పరిస్థితి మాత్రం రాకూడదు. ఇస్రోను ప్రైవేటీకరించాలన్న ఆలోచన ఏ దశలోనైనా ఉంటే దానిని విరమించుకోవాలి. ఎందుకంటే ఇస్రో ఒక సంస్థ మాత్రమే కాదు.. భారత శాస్త్రీయ స్వావలంబనకు ప్రతీక.

# మోదీతో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ భేటీ

- అభివృద్ధి భాగస్వామ్యంపై కీలక చర్చ
- ఆరోగ్యం.. వ్యవసాయం.. గ్రామీణాభివృద్ధిపై దృష్టి
- మహిళలు, యువత సాధికారతకు ప్రాధాన్యం
- ఇమామ్‌గా బాధ్యతల తర్వాత తొలి భారత పర్యటన
- సెప్టెంబర్ 15 వరకు పలు నగరాల్లో పర్యటన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):**భారత పర్యటనలో ఉన్న షియా ఇస్మాయిలీ ముస్లింల 50వ ఆధ్యాత్మిక నాయకుడు, ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఛైర్మన్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, యువత, మహిళా సాధికారత తదితర రంగాల్లో భారత్-ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ మధ్య కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై ఇరువురు చర్చించారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఆయన తండ్రి, దివంగత ఆగా ఖాన్-4 అభివృద్ధి రంగంలో అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మహిళలు, యువత సాధికారత రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత విస్తరించే మార్గాలపై చర్చించినట్లు వెల్లడించారు. ఇస్మాయిలీ సమాజం 50వ ఇమామ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రిన్స్ రహీమ్ భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ సమావేశం కానున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 15 వరకు కొనసాగనున్న పర్యటనలో ప్రిన్స్ రహీమ్ ఢిల్లీతో పాటు అహ్మదాబాద్, ముంబై, హైదరాబాద్‌ను సందర్శించనున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సామాజిక, వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించనున్నారు. భారత్, ఆగా ఖాన్ సంస్థల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న అభివృద్ధి భాగస్వామ్యాన్ని ప్రిన్స్ రహీమ్ పర్యటన మరింత ముందుకు తీసుకెళ్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది.

# 'బాలికను బెదిరిస్తే సహించేది లేదు'

**బాధితురాలి భద్రతపై సుప్రీంకోర్టు సీరియస్**

**సీజేపీ నిరసనల్లో పాల్గొన్న బాలిక కేసుపై విచారణ**

**స్వతంత్ర భరద్వాజ్‌పై వేధింపులు, దాడి ఆరోపణలు**

**ఎస్సీ, ఎస్టీ చట్టం కింద అదనపు సెక్షన్లు**





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):** గత జూలైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల్లో పాల్గొన్న 14 ఏళ్ల బాలికపై నమోదైన వేధింపుల ఆరోపణల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. నేర దర్యాప్తు, న్యాయపరమైన చర్యలు కొనసాగుతున్న సమయంలో బాధిత బాలికను గానీ, ఆమె కుటుంబ సభ్యులను గానీ బెదిరించేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. బాలికపై హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు స్వేచ్ఛగా తిరుగుతూ బాధితురాలిని లేదా ఆమె కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది. గురువారం ఈ వ్యవహారంపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నేర దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియలను కొనసాగించకుండా బాధితురాలిని, ఆమె కుటుంబాన్ని బెదిరించే పరిస్థితి ఉండకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. బాలిక తరపు న్యాయవాది కోర్టుకు పలు అంశాలను వివరించారు. రైట్ వింగ్ కార్యకర్త స్వతంత్ర భరద్వాజ్‌పై కేసు నమోదైన తర్వాత బాలికను వేధించడంతో పాటు ఆమె ఇంటిని కూడా ధ్వంసం చేశారని ఆరోపించారు. సీజేపీ నిరసన సందర్భంగా బాలిక తండ్రిపైనా దాడి జరిగిందని కోర్టుకు తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. కేసు విచారణకు ఉన్నతస్థాయి కమిటీకి కొంత సమయం పట్టే అవకాశం ఉందని, ఈలోగా బాలికకు ఏదైనా జరిగితే ఆ నష్టాన్ని భర్తీ చేయడం అసాధ్యమని న్యాయవాది వాదించారు. ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం.. బాలికపై హింసకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు స్వేచ్ఛగా తిరుగుతూ బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తే అది అత్యంత తీవ్రమైన విషయమని పేర్కొంది. ఇలాంటి వ్యవహారాలను తేలిగ్గా తీసుకోలేమని స్పష్టం చేసింది. బాలికపై హింసకు సంబంధించిన అంశాల్లో ఎవరినీ రక్షించకూడదని పేర్కొంది.

### భరద్వాజ్‌పై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద సెక్షన్లు

స్వతంత్ర భరద్వాజ్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని నిబంధనలతో పాటు నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన సెక్షన్లను ఢిల్లీ పోలీసులు సెప్టెంబర్ 5న చేర్చినట్లు సమాచారం. బాలిక తండ్రిపై దాడి చేసినట్లు భరద్వాజ్ ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారని, రాజకీయ ప్రోత్సాహంతోనే అరెస్టు నుంచి తప్పించుకున్నానని చెప్పినట్లు వచ్చిన కథనాల నేపథ్యంలో ఈ వ్యవహారం మరింత వివాదాస్పదమైంది. ఈ పరిణామాల అనంతరం స్వతంత్ర భరద్వాజ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన జరిగినట్లు తెలుస్తోంది. భరద్వాజ్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే పోలీసులు స్వతంత్ర భరద్వాజ్‌ను బులంద్‌షహర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాధిత బాలిక, ఆమె కుటుంబ సభ్యుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో బాధిత కుటుంబాన్ని బెదిరించే చర్యలకు పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తామని ధర్మాసనం తేల్చిచెప్పింది.

# ఢిల్లీలో బ్రిక్స్ మహాసదస్సు


**12, 13 తేదీల్లో భారత్ మండపం వేదిక ■ పుతిన్, జిన్‌పింగ్ సహా అగ్రనేతల రాక**

**15 వేల మంది పోలీసులతో భారీ భద్రత ■ నాలుగోసారి బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):**ప్రపంచ అగ్రనేతలు ఒకే వేదికపైకి రానున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వసన్నద్ధమైంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న 18వ బ్రిక్స్ సదస్సుకు ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సదస్సుకు వేదికైన భారత్ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం దృశ్యాలను షేర్ చేస్తూ.. "బ్రిక్స్--2026కు సర్వం సిద్ధం" అని పేర్కొన్నారు. సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో పాటు పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ కూడా సదస్సుకు హాజరుకానున్నట్లు సమాచారం. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు. 'మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం' అనే దృక్పథానికి అనుగుణంగా కార్యక్రమాలను రూపొందించినట్లు పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ, ప్రాంతీయ పరిణామాలు, పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై నేతలు విస్తృతంగా చర్చించనున్నారు. ప్రపంచ నేతల రాక నేపథ్యంలో ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఢిల్లీ పోలీసులతో పాటు ఇతర భద్రతా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. దాదాపు 15 వేల మంది పోలీసు సిబ్బందితో పాటు 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించినట్లు సమాచారం. వీవీఐపీల రాకపోకల నేపథ్యంలో పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. బ్రిక్స్ వ్యవస్థాపక సభ్యదేశాల్లో భారత్ ఒకటి. 2012, 2016, 2021లో కూటమికి అధ్యక్షత వహించిన భారత్.. 2026లో నాలుగోసారి బాధ్యతలు చేపట్టింది. ఈ ఏడాదితో బ్రిక్స్ ప్రస్థానానికి 20 ఏళ్లు పూర్తవుతుండటం మరో విశేషం. జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నతస్థాయి కార్యక్రమాలను నిర్వహించి బ్రిక్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేసినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ప్రపంచంలోని కీలక దేశాల అధినేతలు ఢిల్లీకి తరలిరానుండటంతో రెండు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించనుంది.





# హైవే జాప్యంపై సిగ్గుపడుతున్నా.. ప్రారంభోత్సవానికి రాను!

**ముంబై-గోవా పనులపై గడ్కరీ అసహనం**

**నాసిరకం పనులను సహించేది లేదని హెచ్చరిక**

**పనాజీ, సెప్టెంబర్ 10 (సమయం న్యూస్):**ముంబై-గోవా హైవే విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యంపై కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు ఇంత ఆలస్యం కావడం పట్ల తాను సిగ్గుపడుతున్నానని వ్యాఖ్యానించారు. అందుకే ఆ రహదారి ప్రారంభోత్సవానికి తాను హాజరుకాబోనని ముందుగానే ప్రకటించారు. గోవా రాజధాని పనాజీ సమీపంలోని పోర్వోరిమ్ వద్ద నిర్మించిన ఆరు లేన్ల ఎలివేటెడ్ రోడ్డు కారిడార్‌ను గడ్కరీ గురువారం ప్రారంభించారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్, రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి దిగంబర్ కామత్, పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖౌంటే తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ ముంబై--గోవా హైవే విస్తరణ పనులు నత్తనడకన సాగడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "ముంబై-గోవా హైవే పనులు ఇంత ఆలస్యం కావడం నాకు సిగ్గుగా అనిపించింది. అందుకే దాని ప్రారంభోత్సవానికి నేను రానని ముందే ప్రకటిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జాప్యం, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులను ఇకపై ఉపేక్షించబోమని గడ్కరీ హెచ్చరించారు. పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని స్పష్టం చేశారు. "ఒక సంవత్సరంలోనే అత్యధిక సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేసి చర్యలు తీసుకుంటా. బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసి ఒక రికార్డు సృష్టించాలనుకుంటున్నా. ఇక దీన్ని ఆపబోను" అంటూ గడ్కరీ ఘాటుగా హెచ్చరించారు. ముంబై--గోవా హైవే నాణ్యతను స్వయంగా పరిశీలిస్తానని గడ్కరీ ప్రకటించారు.

# సరైన దిశలో డీకే ప్రభుత్వం

- ఐదు గ్యారెంటీలను సవ్యంగా అమలు చేస్తున్నాము
- మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10:** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప – 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

# టీవీకే పార్టీకి అధికారిక గుర్తింపు

- రాష్ట్ర పార్టీ హోదా కల్పిస్తూ ఈసీ నిర్ణయం



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10:** ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

# నిజ జీవితంలో విజయ్ హీరో కాదు.. విలన్

### టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై, సెప్టెంబర్ 10:** తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌పై ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాల్లోనే విజయ్ హీరో అని, నిజ జీవితంలో మాత్రం ఆయనో ఒక పెద్ద విలన్ అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో విజయ్ చేసిన ఒక సైగపై వివాదం చెలరేగిన నేపథ్యంలో దినకరన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో విజయ్ చేసిన ఒక సైగ, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను అపహాస్యం చేసేలా ఉందన్న విమర్శలతో రాజకీయ దుమారం రేగింది. 1976 ఎమర్జెన్సీ కాలంలో జైలులో పోలీసుల దాడి కారణంగా స్టాలిన్ దవడ ఎముక విరిగింది. విజయ్ చేసిన సైగ ఆ విషయాన్ని ఎగతాళి చేసేలా ఉందని డీఎంకే నేతలు మండిపడ్డారు. అయితే, ఆ సైగ యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప ఉద్దేశపూర్వకం కాదని విజయ్ వివరణ ఇచ్చారు. అయినప్పటికీ ఈ వివాదం సద్దుమణగలేదు. స్వయంగా స్టాలిన్ కూడా ఈ అంశంపై స్పందిస్తూ, జైలులో తాను అనుభవించిన చిత్రహింసలను గుర్తుచేసుకున్నారు. తమిళనాడు రాజకీయ చరిత్రను చదువుకోవాలని విజయ్‌కు హితవు పలికారు. ఈ వివాదంపై దినకరన్ మరింత ఘాటుగా స్పందించారు. "విజయ్ ఒక స్వార్థపరుడు, తన స్వలాభం కోసం ఎవరినైనా బలి ఇచ్చే మనస్తత్వం ఉన్న వ్యక్తి. ఆయన మాట తీరు, బాడీ లాంగ్వేజ్ చూస్తుంటేనే ఆయన వ్యక్తిత్వం ఎలాంటిదో అర్థమవుతోంది" అని దినకరన్ తీవ్రంగా ఆరోపించారు.



# రైతు వ్యతిరేక చట్టాలపై రైతు ఉద్యమం

### కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలతో రైతు మనుగడ ప్రశ్నార్థకం

### ఎల్ ని నో ప్రభావంతో నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలి.

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం డిమాండ్

**ఉంగుటూరు, సెప్టెంబర్ 10:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న రైతు వ్యతిరేక చట్టాలపై రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరం లోని గుత్తికొండ వారి సత్రం హాలులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలపై రైతాంగం చారిత్రాత్మక ఉద్యమం చేశారని, ఫలితంగా ఆ చట్టాలను రద్దు చేసి మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50% కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని, ఈ ధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కానీ నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అనుకూల రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువస్తున్నాయని, దీనితో రైతు మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ల నియంత్రణ చట్టం, సహకార చట్టం, విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టం, ప్రకృతి వైపరీత్యాల సహాయ కార్యక్రమాల చట్టం, ఎరువుల విధానం, పంటల బీమా పథకం, డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్ ఇలా అనేక చట్టాలు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్చి వేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల ఎకరాలు రాష్ట్రంలో భూ సేకరణ చేసి కార్పొరేట్ కంపెనీలకు రైతుల భూములను కట్టబెట్టాలని చూస్తోందని, బలవంతపు భూసేకరణ వలన రైతులు నష్టపోతున్నారని చెప్పారు. బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంతో నష్టపోతున్న అన్ని పంటల రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, పాడిపశువులకు సబ్సిడీపై దాణా అందించాలని కోరారు. కోకో,కొబ్బరి, ఆయిల్ పామ్, పొగాకు, విత్తన రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతాంగ సమస్యలపై దశల వారి ఉద్యమం చేపట్టాలని సమావేశం నిర్ణయించిందని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, లావేటి సోంబాబు, బోడిక రామచంద్ర రావు, దాసరి సతీష్, వీరవల్లి భాస్కరరావు, సున్నా వెంకట్రావు, గుండపనేని సురేష్, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లడఖ్‌కు త్వరలోనే ప్రత్యేక హోదా..

### ఆర్టికల్ 371 సవరణకు కేంద్రం కసరత్తు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10:** గత నాలుగేళ్లుగా లడఖ్ ప్రజలు చేస్తున్న డిమాండ్ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. లడఖ్ ప్రాంతానికి ఆర్టికల్ 371 కింద రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే హిమాలయ ప్రాంతమైన లడఖ్ పాలన కోసం భారతదేశంలోనే మొదటిసారిగా 'సూయి జెనెరిస్' నమూనాలో ఒక ఎన్నికైన పాలక మండలిని ఏర్పాటు చేయనున్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో లడఖ్ చీఫ్ సెక్రటరీ ఆశిష్ కుంద్రా మాట్లాడుతూ.. లడఖ్‌కు తగిన రాజ్యాంగ పరిరక్షణలు కల్పించేందుకు పార్లమెంట్ ఆర్టికల్ 371ని సవరిస్తుందని తెలిపారు. లడఖ్‌కు రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడం, ఎన్నికైన మండలిని ఏర్పాటు చేసే ప్రక్రియను కేంద్ర హోం శాఖ ఇప్పటికే ప్రారంభించిందని ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 నిర్దిష్ట రాష్ట్రాల ప్రత్యేక ప్రాంతీయ, సామాజిక అవసరాలను తీర్చడానికి తాత్కాలిక, పరివర్తన, ప్రత్యేక అధికారాలను అందిస్తుంది. "మేము ఒక ప్రత్యేకమైన పాలనా నమూనాపై పనిచేస్తున్నాం... ఇది 'సూయి జెనెరిస్' మోడల్. లడఖ్‌లో ఎన్నికైన పాలక మండలి ఉంటుంది, కానీ ఇది శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగానీ లేదా రాష్ట్రంగానీ కాదు" అని కుంద్రా వివరించారు. 'సూయి జెనెరిస్' అనేది ఒక ప్రత్యేక పరిస్థితిని నిర్వహించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన చట్టపరమైన వ్యవస్థ. ఈ లాటిన్ పదానికి 'తనదైన శైలి' లేదా 'ప్రత్యేకమైనది' అని అర్థం. లడఖ్ నాయకులతో చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వ బృందంలో ఆశిష్ కుంద్రా భాగస్వామిగా ఉన్నారు. మంగళవారం ఢిల్లీలో ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి. ఆర్టికల్ 370 రద్దుచేసిన కేంద్రం జమ్మూ కశ్మీర్, లడఖ్‌గా విభజించి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రారంభంలో లడఖ్‌లోని ఒక వర్గం కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించినప్పటికీ, కాలక్రమేణా అధికారుల పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. వారు రాష్ట్ర హోదాతో పాటు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.



# చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..

### మరమ్మతుల కోసం ఆగిన కార్గో నౌక

### 20 మంది మృతి, ఐదుగురు గల్లంతు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10:** చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

# హత్య కేసులో లొంగిపోయిన నిందితుడు


**నెల్లూరు, సెప్టెంబర్ 10:** నెల్లూరు, తిరుపతి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో సంచలనం సృష్టించిన టీడీపీ కార్యకర్త బాలయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఆయనకు 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో, పోలీసులు ఆయనను భద్రత నడుమ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. పెళ్లకూరు మండలం చిల్లకూరు ప్రాంతంలోని కాల్వలు, ప్రభుత్వ పోరంబోకు భూములను సత్యనారాయణ రెడ్డి ఆక్రమించారంటూ స్థానిక టీడీపీ నేతలు గతంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సంయుక్త సర్వేలో ఆక్రమణ నిజమేనని తేలింది. ఆక్రమిత స్థలంలో తన సొంత పొలానికి దారి వేసుకునేందుకు సత్యనారాయణరెడ్డి ప్రయత్నించగా టీడీపీ కార్యకర్త బాలయ్య సహా పలువురు అడ్డుకుని ప్రశ్నించారు. దీంతో ఆక్రోశానికి గురైన సత్యనారాయణరెడ్డి, తన అనుచరులతో కలిసి టీడీపీ నేతలపై దాడికి తెగబడ్డారు. ఈ గొడవలో బాలయ్య ఛాతీపై ప్రత్యర్థులు పిడిగుద్దులతో విరుచుకుపడటంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సత్యనారాయణ రెడ్డిని ఏ1 నిందితుడిగా చేర్చి కేసు నమోదు చేయగా... పోలీసు అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఆయన చివరకు కోర్టులో లొంగిపోవాల్సి వచ్చింది.

# ట్రంప్ డివిడెండ్

### రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి అమెరికన్‌కు 5 వేల డాలర్లు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర చర్చనీయాంశమైన ప్రకటన చేశారు. రాబోయే మధ్యంతర ఎన్నికల్లో తమ రిపబ్లికన్ పార్టీ విజయం సాధించి, కాంగ్రెస్‌లోని ఉభయ సభలపై నియంత్రణ సాధిస్తే.. దేశంలోని ప్రతి వయోజన అమెరికా పౌరుడికి 5,000 డాలర్లు (సుమారు రూ.4.2 లక్షలు) ఇస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ సంక్షేమాన్ని ఆయన "ట్రంప్ డివిడెండ్ గా పేర్కొన్నారు. టెక్సాస్‌లోని డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ మధ్యంతర ఎన్నికల సభలో డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. డెమోక్రాట్‌లతో పోటీలో రిపబ్లికన్ పార్టీ ఓటింగ్ సర్వేల్లో వెనుకబడి ఉన్న నేపథ్యంలో, ఓటర్లను ఆకర్షించేందుకు ట్రంప్ ఈ అసాధారణ హామీ ఇచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సభలో ట్రంప్ మాట్లాడుతూ.. "అమెరికా అద్భుతమైన ఆర్థిక విజయం కారణంగా ఈ హామీ నేను మాత్రమే చేయగలను. నవంబర్ 3న జరగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిస్తే, మీరు మాతో కలిసి గెలుస్తారు. మీకు 5,000 డాలర్లు లభిస్తాయి. నవంబర్ బ్యాలెట్‌లో నేను స్వయంగా పోటీలో ఉన్నట్లే భావించి ఓటు వేయండి" అని మద్దతుదారులను కోరారు.ట్రంప్ డెవిడెండ్ హామీ అమలుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలో దాదాపు 27 కోట్ల మంది వయోజనులు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ 5,000 డాలర్ల చొప్పున పంపిణీ చేయాలంటే ప్రభుత్వానికి సుమారు 1.35 ట్రిలియన్ డాలర్లు ఖర్చవుతుందని విశ్లేషకులు తెలిపారు. అయితే, ఈ భారీ మొత్తం నిధులు ఎక్కడి నుంచి వస్తాయనే దానిపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. "మన దేశం చాలా డబ్బు సంపాదిస్తోంది" అని మాత్రమే ట్రంప్ చెప్పారు. ఈ చెల్లింపుల ప్రక్రియ ఎలా పనిచేస్తుంది, అసలు ఇలా డబ్బులు పంచడం చట్టబద్ధమేనా అనే అంశాలపై ఇంకా స్పష్టత లేదు.మధ్యంతర ఎన్నికల్లో గెలవడం కోసం ట్రంప్ బహిరంగంగా ఓటర్లకు లంచం ఇస్తున్నారని విమర్శకులు, సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. "రిపబ్లికన్లకు ఓటు వేస్తే వి5,000 ఇస్తాననడం డివిడెండ్ ఎంతమాత్రం కాదు.. అది పక్కా లంచం" అని ఎక్స్ వేదికగా నెటిజన్లు ఆరోపించారు. ప్రముఖ అమెరికన్ స్టాక్ బ్రోకర్ పీటర్ షిఫ్ స్పందిస్తూ.. "ఓటర్లను ఆకట్టుకోవడానికి ట్రంప్ ఈ రకమైన ప్రతిపాదన చేశారు. ఈ ఉచిత డబ్బు కోసం ఫెడరల్ రిజర్వ్ భారీగా కరెన్సీ నోట్లను ముద్రించాల్సి వస్తుంది. ఫలితంగా బైడెన్ హయాంలో చూసిన దానికంటే అతి తీవ్రమైన ద్రవ్యోల్బణం వచ్చే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. ఓట్ల కోసం ట్రంప్ చేసిన ఈ 1 ట్రిలియన్ డాలర్ల వాగ్దానం ఇప్పుడు అమెరికా వ్యాప్తంగా తీవ్ర రాజకీయ, ఆర్థిక చర్చకు దారితీసింది.





## శ్రోతల జీవితాలలో భాగాలు..
# బావగారి కబుర్లు

### నేడు ప్రయాగ నరసింహ శాస్త్రి వర్ధంతి

ఆకాశవాణి శ్రోతలకు చిర పరిచితులు ప్రయాగ నరసింహ శాస్త్రి. రేడియోనే ప్రధాన మనో రంజక సాధనంగా ఒకనాటి ప్రజల నిత్య జీవితాలతో పెనవేసుకున్న రోజులలో ప్రయాగ నిత్య విధి కార్యక్ర మాలు శ్రోతల జీవిత భాగస్వాములు అయినా యంటే అతిశయోక్తి కాదేమో. ఆకాశ వాణి ప్రయోక్తగా, తెలుగు సినీ నటునిగా, హరికథకులుగా, రచయితగా, గాయకునిగా ప్రయాగ నరసింహ శాస్త్రి (నవంబరు 20, 1909 – సెప్టెంబరు 11, 1983) తెలుగు ప్రజలకు రేడియో ద్వారా చిర పరిచితులు.

తన ప్రత్యేక కంఠ స్వరంతో ఖంగుమని పలుకుతూ, జానపద శైలిలో పాడుతూ శ్రోతల్ని ఉర్రూత లూగించిన వ్యక్తి శ్రీ ప్రయాగ నరసింహ శాస్త్రి. మూడు దశాబ్దాలు ఆకాశవాణిలో పనిచేసి ప్రశంసా పాత్రుడైన వ్యక్తి. 1936 లో ప్రయాగ ఆకాశవాణి మదరాసు కేంద్రంలో నిలయ విద్వాంసు డుగా చేరారు. ‘ బావగారి కబుర్ల ద్వారా ఆయన శ్రోతలకి చేరువయ్యారు. ఆయన, గాడేపల్లి సూర్య నారాయణతో కలిసి బావగారి కబుర్లు నిర్వహించే వారు. అవి శ్రోతల జీవనంలో భాగమై పోయాయి. “ఏమండోయ్ బావగారు రావాలి రావాలి” అనే పలకరింపులు సహజమ య్యాయి. స్క్రిప్టు లేకుండా యధాలాపంగా అనర్గళంగా తన సంభాషణలతో వినోదాన్ని అందించేవారు ప్రయాగ.

నరసింహశాస్త్రి 1909 నవంబర్ 20 న విశాఖపట్నం జిల్లా పెదగాడి గ్రామంలో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. బాల్యం నుండి సంగీత సాహిత్యాలపై అపారమైన ప్రీతి. విజయనగరం మహారాజా కళాశాలలో చదువు కొని పట్ట భద్రులయ్యారు. శ్రీశ్రీ, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ఆయన సహా ధ్యాయులు. హరికథా పితామ హుడు ఆదిభట్ల నారాయణ దాసు వద్ద హరికథా గానంలో మెళుకువలు నేర్చు కొన్నారు. చక్కని గాత్రము రూపము ఉన్న ప్రయాగ 1935లో చలన చిత్రరంగ ప్రవేశం చేశారు. భీష్మ చిత్రంలో విచిత్ర వీర్యుని పాత్రను పోషించారు. నాగయ్య గారి త్యాగయ్య చిత్రంలో గణపతి పాత్రను పోషించారు. అనేక చిత్రాలకు పాటలు వ్రాశారు. 1969లో ఆకాశ వాణిలో పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ నటన పై ఆసక్తి తో చిత్రరంగంలో ప్రవేశించారు. చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం వంటి సినిమాలలో నటించారు.

ఆకాశవాణి మదరాసు కేంద్రంలో 1936 నుండి రెండు దశాబ్దాలు పని చేశారు. అక్కడ వీరు ప్రసారం చేసిన మొద్దబ్బాయ్ హెచ్.ఎం.వి. గ్రామఫోన్ రికార్డు కంపెని వారు రికార్డు చేసి విడుదల చేశారు. 20కి పైగా హెచ్.ఎం.వి. రికార్డులు ఆయన విడుదల చేశారు. శ్రోతలలో వీరికంత ప్రశస్తి వుండేది. 1956లో ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి బదలీ అయ్యారు. అక్కడ పింగళి లక్ష్మీకాంతం, బందా కనక లింగేశ్వర రావు, బాలాంత్రపు రజనీ కాంత రావు, జరుక్ శాస్త్రి, బాల మురళి, ఓలేటి వంటి పండితుల సాహచర్యం లభించింది.

విజయవాడలో ప్రయాగ గ్రామీణ కార్యక్రమాల ప్రయోక్తగా పనిచేశారు. ఎన్నో జానపద గేయాలను పాడి, పాడించి శ్రోతల మన్ననలందు కొన్నారు. హరికథలు స్వయంగా రచించి గానం చేశారు. త్యాగరాజ చరిత్ర, కన్యాకుమారి, గాంధీజీ, శంకర విజయం హరి కథలు ప్రముఖాలు. 1962లో భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ సమక్షంలో గాంధీజీ బుర్రకథను వినిపించి బంగారు పతకంతో సన్మానించ బడ్డారు. ఆయన వివిధ బుర్రకథలు హెచ్.ఎం.వి. గ్రామఫోను రికార్డులుగా విడుదలైనాయి.



వినోదాల వీరయ్యగా విజయ వాడ కేంద్రం నుండి ఎన్నో కార్యక్రమాలు సమర్పించారు. ఆకాశవాణిని ప్రయాగకు ఆరోప్రాణంగా భావించే వారు. 1969లో పదవీ విరమణ చేసేంత వరకు ఆయన ప్రయోక్తగా ఎన్నో కార్యక్రమాలు వెలువడ్డాయి. 1970 నుండి ఐదు సంవత్సరాలు కేంద్ర సంగీత నాటక అకాడమీ పక్షాన ‘ బాలాజీ ఆర్ట్ థియేటర్ ‘ పేరుతో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. 1980 నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంగీత కళా పీఠంలో యక్షగానాలు, హరికథల అధ్యాపకులుగా పని చేశారు. హిందు ధర్మ ప్రచార పరిషత్ లో జానపద కళా ప్రచారకులుగా వ్యవహరించారు. 1983 సెప్టెంబరు 11న పరమ పదించారు. మాట, పాట, ఆటలతో శ్రోతల్ని సంబరపెట్టిన ప్రయాగ నిత్యోత్సాహి. ప్రయాగ నరసింహ శాస్త్రి కుమార్తె వేదవతి ఆకాశవాణిలో నిజామాబాద్ లో అసిస్టెంట్ స్టేషను డైరక్టరుగా సుపరిచితులు. భీష్మ – విచిత్ర వీర్యుడు, త్యాగయ్య – గణపతి, చీకటి వెలుగులు, అందాల రాముడు, డబ్బుకు లోకం దాసోహం తదితర చిత్రాలలో ఆయన నటించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రకృతి రక్షణకు ప్రాణ త్యాగం..
# అటవీ అమరవీరుల జ్ఞాపకం

- నేడు జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం
- అడవుల కోసం ప్రాణాలర్పించిన వనరక్షకులకు వందనం
- ఖేజర్లీలో 363 మంది బిష్ణోయిాల మహా బలిదానం
- చెట్టును కాపాడేందుకు ప్రాణాన్నే పణంగా పెట్టిన అమృతాదేవి



**అడవి అంటే కేవలం చెట్ల సమూహం కాదు.. అది అనేక జీవులకు ఆవాసం. మనిషికి ప్రాణవాయువు. భూమికి పచ్చని రక్షణ కవచం. వర్షాలకు ఆధారం. జీవ వైవిధ్యానికి నిలయం. అలాంటి అరణ్య సంపదను కాపాడేందుకు కొందరు తమ జీవితాలనే అంకితం చేశారు. మరికొందరు విధి నిర్వహణలో ప్రాణాలనే బలిపెట్టారు. వారి త్యాగాలను స్మరించుకునే సందర్భమే సెప్టెంబర్ 11.. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం.**

భారతదేశం ప్రకృతి ప్రసాదించిన అపారమైన అరణ్య సంపద, జీవ వైవిధ్యం, వన్యప్రాణులతో విశిష్టమైన దేశం. పర్వతాలు, నదులు, పచ్చని చెట్లు, ఔషధ మూలికలు, జంతువులు, పక్షులతో కూడిన అరణ్య వ్యవస్థ మన పర్యావరణ సమతుల్యతకే కాదు.. సాంస్కృతిక వారసత్వానికి, ఆర్థిక వ్యవస్థకు కూడా కీలక ఆధారం. ఈ సంపదను కంటికి రెప్పలా కాపాడుతూ ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బందికి నివాళులర్పించేందుకు ఏటా సెప్టెంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

### అడవి కోసం నిత్యం పోరాటమే..

అడవులను కాపాడటం సాధారణ ఉద్యోగం కాదు. ప్రతి అడుగులోనూ సవాళ్లు ఎదురయ్యే కర్తవ్యం. ఫారెస్ట్ గార్డులు, రేంజర్లు, అధికారులు మారుమూల అటవీ ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తుంటారు. వేటగాళ్లు, అక్రమ కలప మాఫియాలు, వన్యప్రాణుల అక్రమ రవాణా ముఠాలను అడ్డుకునే క్రమంలో ప్రాణహానిని సైతం ఎదుర్కొంటారు. ఎండైనా.. వానైనా.. రాత్రైనా.. పగలైనా అడవే వారి కార్యక్షేత్రం. అగ్నిప్రమాదాలు, వన్యప్రాణుల దాడులు, అక్రమార్కుల బెదిరింపులు వంటి ప్రమాదాల మధ్య విధులు నిర్వహిస్తూ ఎంతోమంది అటవీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వనరక్షకుల త్యాగాలకు దేశం చేసే వందనమే ఈ అమరవీరుల దినోత్సవం.



### ఖేజర్లీ.. చరిత్రలో చెరగని త్యాగం

ఈ దినోత్సవం వెనుక ప్రకృతి పరిరక్షణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహత్తర ఘట్టం ఉంది. 1730 సెప్టెంబర్ 11న రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సమీపంలోని ఖేజర్లీ గ్రామంలో బిష్ణోయిా సమాజానికి చెందిన ప్రజలు చెట్ల రక్షణ కోసం అసమాన త్యాగం చేశారు. అప్పటి జోధ్‌పూర్ పాలకుడు అభయ్‌సింగ్ అవసరాల కోసం కలప సేకరించేందుకు సైనికులు ఖేజర్లీ గ్రామానికి చేరుకుని చెట్లను నరికేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో అమృతాదేవి బిష్ణోయిా చెట్లను నరకకుండా అడ్డుకున్నారు. ప్రాణం పోయినా చెట్టును మాత్రం నరకనివ్వబోనన్న దృఢ సంకల్పంతో ఆమె చెట్టును హత్తుకుని నిలబడ్డారు. ఆమె స్ఫూర్తితో గ్రామంలోని పురుషులు, మహిళలు, పిల్లలు ఒక్కొక్కరు ఒక్కో చెట్టును హత్తుకుని వాటికి రక్షణగా నిలిచారు. ఈ ఘటనలో అమృతాదేవితో పాటు మొత్తం 363 మంది బిష్ణోయిాలు ప్రాణాలు కోల్పోయారు. ప్రకృతి కోసం మనిషి ప్రాణాన్నే అర్పించిన ఈ మహా బలిదానం పర్యావరణ పరిరక్షణ చరిత్రలో చెరగని అధ్యాయంగా నిలిచిపోయింది.



### ఆ త్యాగానికి గుర్తుగానే..

ఖేజర్లీ అమరవీరుల త్యాగ స్ఫూర్తిని గుర్తుచేస్తూ సెప్టెంబర్ 11కు ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. అటవీ సంరక్షణలో విధి నిర్వహణ సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బందిని స్మరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 2001లో సెప్టెంబర్ 11ను జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంగా పాటించాలని నిర్ణయించింది. అప్పటి నుంచి ఏటా ఈ రోజున దేశవ్యాప్తంగా అటవీ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నారు. వారి కుటుంబాల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వన సంరక్షణలో అటవీ సిబ్బంది నిర్వహిస్తున్న పాత్రను ప్రజలకు వివరిస్తున్నారు.

### అమరవీరులకు నివాళి.. అడవులపై అవగాహన

అటవీ సిబ్బంది త్యాగాలను గుర్తించడం, వారికి గౌరవం ఇవ్వడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. దాంతోపాటు అడవుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం, పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడినీ భాగస్వామిని చేయడం మరో లక్ష్యం. క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న అటవీ సిబ్బందికి సమాజం అండగా నిలవాల్సిన అవసరాన్ని కూడా ఈ రోజు గుర్తుచేస్తుంది. దేశవ్యాప్తంగా అటవీ అమరవీరుల స్మారకాల వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటారు. విద్యాసంస్థల్లో అరణ్య సంరక్షణ ప్రాముఖ్యతపై సదస్సులు, చర్చలు, ప్రదర్శనలు నిర్వహిస్తారు. వృక్షారోపణ కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులు, యువతను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేస్తారు. పలు పర్యావరణ సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి.

### అడవి ఉంటేనే మనుగడ

వాతావరణ మార్పులు, భూతాపం, వర్షాభావం, భూక్షయం, జీవ వైవిధ్యం క్షీణించడం వంటి సవాళ్లు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అడవుల సంరక్షణ మరింత కీలకంగా మారింది. అభివృద్ధి పేరుతో అడవులను విచక్షణారహితంగా నాశనం చేస్తే దాని మూల్యం భవిష్యత్తు తరాలు చెల్లించాల్సి వస్తుంది. చెట్టు నాటడం ఎంత ముఖ్యమో.. ఉన్న చెట్టును కాపాడటం అంతకంటే ముఖ్యం. అటవీ ప్రాంతాలను పరిరక్షించడం కేవలం అటవీ శాఖ బాధ్యతగా భావించకుండా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాల్సిన అవసరం ఉంది.

### 363 ప్రాణాలు చెప్పిన పాఠం..

ఖేజర్లీలో 363 మంది చేసిన త్యాగం శతాబ్దాలు గడిచినా మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తోంది. ప్రకృతిని కాపాడటం అంటే మనిషి తన భవిష్యత్తును తానే కాపాడుకోవడం. అదే స్ఫూర్తితో అడవులను రక్షిస్తూ ప్రాణాలు కోల్పోయిన అటవీ అమరవీరుల త్యాగం కూడా తరతరాలకు మార్గదర్శకం. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం కేవలం నివాళులు అర్పించి వెళ్లిపోయే రోజు కాకూడదు. అడవిని నాశనం చేయనివ్వమని, జీవ వైవిధ్యాన్ని కాపాడతామని, ప్రకృతి సంపదను భావితరాలకు అందిస్తామని సంకల్పించే రోజుగా మారాలి. అడవి మనకు ఇచ్చేది ప్రాణవాయువు.. నీరు.. జీవనం. దానికి ప్రతిగా మనం చేయాల్సింది ఒక్కటే.. దానిని కాపాడటం. ప్రకృతిని రక్షిస్తేనే.. ప్రకృతి మనల్ని రక్షిస్తుంది. అటవీ అమరవీరులకు మనం అర్పించగల నిజమైన నివాళి కూడా అదే.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# టీమిండియాకు దూరమైన తర్వాత ఆకలి పెరిగింది

దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ 13 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్‌పై ఆధిపత్యం ప్రదర్శించి టైటిల్ సొంతం చేసుకుంది. ఈ విజయానికి జట్టు సమష్టి కృషి, ఐక్యతే కారణమని కెప్టెన్ ఇషాన్ కిషన్ చెప్పాడు. "ఈ విజయం మా అందరిదీ. ఒకరికొకరం అండగా నిలిచాం. అదే ఈ జట్టు బలం. నాయకుడిగా నేను కూడా నా వంతు బాగానే చేశాననుకుంటా" అంటూ ఇషాన్ నవ్వుతూ చెప్పాడు. అయితే విజయంతో ప్రయాణం ముగియదని అన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని విభాగాల్లో ఇంకా మెరుగుపడాల్సి ఉందని తెలిపాడు. ఫైనల్లో ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 270 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యంతో ఈస్ట్ జోన్‌కు విజయం ఖాయమైంది. దీంతో 2012-13 సీజన్ తర్వాత తొలిసారి దులీప్ ట్రోఫీని గెలుచుకుంది. జాతీయ జట్టుకు దూరంగా ఉన్న సమయంలో తనలో చాలా మార్పు వచ్చిందని ఇషాన్ చెప్పాడు. ఇప్పుడు మరింత ప్రశాంతంగా ఉంటున్నానని, పరిస్థితులను బాగా అర్థం చేసుకుంటున్నానని చెప్పాడు. జట్టు కోసం ఆడాలనే ఆకలి తనలో మరింత పెరిగిందన్నాడు. జట్టు కోసం ఆడడం, టైటిల్ గెలవడమే ఇప్పుడు తన లక్ష్యమని స్పష్టం చేశాడు. కెప్టెన్‌గా ఇషాన్‌కు ఇది రెండో దేశవాళీ టైటిల్. 2025-26 సీజన్‌లో సొంత రాష్ట్రం ఝార్ఖండ్‌కు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ అందించాడు.



# 2027 ప్రపంచకప్ వరకు చూద్దాం

## గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో రోహిత్

2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై చర్చ జరుగుతోంది. దీనిపై రోహిత్ తాజాగా స్పందించాడు. అయితే తన నిర్ణయాన్ని మాత్రం స్పష్టంగా వెల్లడించలేదు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న రోహిత్‌ను ఓ అభిమాని ఇదే విషయంపై ప్రశ్నించాడు. 2027 అక్టోబర్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడతారా? అని అడిగాడు. దీనికి "2027 అక్టోబర్ చాలా దూరంలో ఉంది. అప్పటికి చూద్దాం" అని రోహిత్ బదులిచ్చాడు. దీంతో ప్రపంచకప్ ఆడే విషయంపై రోహిత్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టమైంది. రోహిత్ ఇప్పటికే టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2027 ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇదే కార్యక్రమంలో.. 2027 ప్రపంచకప్‌ను భారత్ గెలిస్తే 2024 టీ20 ప్రపంచకప్ విజయోత్సవంలా ముంబైలో బస్ పరేడ్ నిర్వహిస్తారా? అని రోహిత్‌ను అడిగారు. "ఇప్పుడు బస్ పరేడ్ సాధ్యమవుతుందని అనుకోవడం లేదు" అని సరదాగా స్పందించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా గతంలో కొట్టిపారేశారు. రోహిత్ అద్భుతంగా ఆడుతున్నప్పుడు అతడి ఎంపికపై సందేహాలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి వన్డేలో రోహిత్ 138 పరుగులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఊహాగానాలకు తాను ఆజ్యం పోయనని చెప్పారు.

# దులీప్ ట్రోఫీ ఛాంపియన్‌గా ఈస్ట్ జోన్..!

- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఘనవిజయం
- 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు పడిన తెర






చెన్నై వేదికగా జరిగిన దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరులో ఈస్ట్ జోన్ చారిత్రక విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యం ఆధారంగా సౌత్ జోన్‌ను నెట్టివేసి ఛాంపియన్‌గా నిలిచింది. దీంతో ఏకంగా 13 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత ఈస్ట్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్.. 708 పరుగులు చేసింది. అనంతరం సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌట్ అయింది. ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌ను 388/7 వద్ద డిక్లేర్ చేసింది. ఇక మ్యాచ్ ఫలితం తేలేలా కనిపించకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. దీంతో ఈస్ట్ జోన్ ఆటగాళ్లు మైదానంలో సంబరాల్లో మునిగిపోయారు. ఈస్ట్ జోన్ చారిత్రాత్మక విజయంలో ఆ జట్టు కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ప్రధానపాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగుల ద్విశతకంతో విరుచుకుపడిన ఇషాన్, రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులతో మెరిశాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సౌత్ జోన్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టిన ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు ఆఖరి రోజున యువ బ్యాటర్ మహమ్మద్ కౌనైన్ ఖురైషి అద్భుతమైన సెంచరీతో నాటౌట్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. విజయం సాధించిన తర్వాత ఈస్ట్ జోన్ డ్రెస్సింగ్ రూమ్‌లో పండగ వాతావరణం నెలకొంది. ఇషాన్ కిషన్, టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీలు చేతిలో వికెట్ స్టంప్‌లు పట్టుకుని గ్రౌండ్ చుట్టూ తిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు. పిచ్‌పై డ్యాన్స్ చేస్తూ తమ విజయోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఈ విజయం ఈస్ట్ జోన్ క్రికెట్ చరిత్రలోనే అత్యంత ప్రత్యేకమైనదిగా నిలిచిపోనుంది. ఈ మ్యాచ్ ఫలితం ఇప్పటికే తేలిపోయినప్పటికీ, సౌత్ జోన్ స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ చూపించిన క్రీడాస్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది. ఉక్కపోత, తీవ్రమైన అలసట ఉన్నప్పటికీ ఫలితం మారదని తెలిసినా సిరాజ్ వరుసగా 9 ఓవర్లు బౌలింగ్ చేసి తన నిబద్ధతను చాటుకున్నాడు. ఇక సౌత్ జోన్ తరపున ఒంటరి పోరాటం చేసిన యంగ్ సెన్సేషన్ తిలక్ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. రెండు ఇన్నింగ్స్?ల్లోనూ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్న ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. అతడు మొదటి ఇన్నింగ్స్‌లో 270 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 80 పరుగులు చేశాడు. అలాగే సౌత్?జోన్?కు కెప్టెన్?గా వ్యవహరించిన తిలక్ వర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది. మ్యాచ్ అనంతరం ఇషాన్ కిషన్ తమ జట్టు వ్యూహం గురించి వివరించాడు. "జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నప్పుడు ముందుగా పరిస్థితులను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మేం రెండు రోజుల పాటు బ్యాటింగ్ చేశాం. దీంతో ఈ మ్యాచ్? ఫలితాన్ని తేల్చేది మొదటి ఇన్నింగ్సే అని మాకు అర్థమైంది. కాబట్టి, ప్రత్యర్థిని వీలైనంత తక్కువ స్కోర్?కు ఆలౌట్ చేసి లీడ్ సాధించడమే మా లక్ష్యం. అయితే మ్యాచ్?లో విజయం సాధించే విధంగా తొలి ఇన్నింగ్స్?లో మాకు లీడ్ వచ్చింది. దీంతో ఇంతటి తీవ్రమైన ఎండలో మేం మళ్లీ మైదానంలోకి ఎందుకు దిగాలని అనుకుంటాం?" అని ఇషాన్ చెప్పాడు.

# అఫ్గాన్, ఆసియా గేమ్స్ భారత జట్టులో మార్పులు

- గాయంతో దూరమైన పేసర్ హర్షిత్ రాణా
- జట్టులో చోటు సంపాదించిన యష్ ఠాకూర్



అఫ్గనిస్థాన్‌తో సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్, ఆ తర్వాత జరగనున్న ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్ కోసం భారత జట్టులో బీసీసీఐ కీలక మార్పు చేసింది. గాయం కారణంగా జట్టుకు దూరమైన యంగ్ పేసర్ హర్షిత్ రాణా స్థానంలో విదర్భ పేసర్ యష్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు. గత జులైలో జింబాబ్వే పర్యటనలో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యష్‌కి ఇది రెండో టీ20 సిరీస్ కావడం విశేషం. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రీహ్యాబిలిటేషన్ పొందుతున్న హర్షిత్ రాణాకు మరోసారి తీవ్ర గాయమైంది. సెప్టెంబర్ 7న జరిగిన మ్యాచ్ సిమ్యులేషన్ సందర్భంగా బౌలింగ్ చేస్తుండగా అతడికి రెక్టస్ ఫెమోరిస్ (తొడ ముందు భాగం) కండరం పట్టేసిందని బీసీసీఐ వైద్యాధికారులు ధృవీకరించారు. గతంలో తొడపిక్క గాయంతో బాధపడిన రాణా, కోలుకునే క్రమంలోనే ఈ కొత్త గాయం బారిన పడటంతో అఫ్గన్ సిరీస్‌తో పాటు ఆసియా గేమ్స్‌కు కూడా పూర్తిగా దూరమయ్యాడుడోమెస్టిక్ క్రికెట్‌లో సయ్యద్ మ-ఀస్తాక్ అలీ ట్రోఫీలో కేవలం 7 మ్యాచ్‌ల్లోనే 18 వికెట్లు తీసి అందరి దృష్టిని ఆకర్షించాడు యష్ ఠాకూర్ . ఆపై జింబాబ్వే పర్యటనలో 2 మ్యాచ్‌లు ఆడి 4 వికెట్లు పడగొట్టాడు. డెత్ ఓవర్లలో కచ్చితమైన యార్కర్లు వేయగల సామర్థ్యం ఉన్న యష్ రాకతో భారత పేస్ విభాగం బలంగా మారింది. సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే అఫ్గన్ సిరీస్ పూర్తయ్యాక, ఆసియా గేమ్స్‌కు ముందు భారత్ ఒక చారిత్రక మ్యాచ్‌లో జపాన్‌తో కూడా తలపడనుంది. మరోవైపు ఫిట్‌నెస్ నిరూపించుకున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌లను బీసీసీఐ అప్‌డేటెడ్ స్క్వాడ్‌లోకి అధికారికంగా చేర్చింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా భారత జట్టు బరిలోకి దిగుతోంది. సెప్టెంబర్ 13న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో అఫ్గనిస్థాన్‌తో తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత ఆసియా గేమ్స్ జరగనున్నాయి.

# ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించిన శీతల్ దేవి

భారత పారా ఆర్చర్ శీతల్ దేవీ మరోసారి సత్తా చాటింది. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్నవరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ 2026లో ఆమె స్వర్ణం ముద్దాడింది. కాంపౌండ్ ఈవెంట్‌లో బరిలో దిగిన శీతల్ ఫైనల్?లో కజికిస్థాన్‌కు చెందిన ఐజాదా సీడన్‌తో పోటీపడింది. అయి-ంతే ఇద్దరూ పోటీపోటీగా ఆడడంతో ఫైనల్ ఉత్కంఠభరితంగా సాగింది. ఇందులో ఇరువురు 144-144తో సమంగా నిలిచారు. అనంతరం ఆట షూట్-ఆఫ్‌కు వెళ్లింది. అక్కడ శీతల్ 10 - 9తో తేడాతో విజయం సాధించి పసిడి పతకం పట్టేసింది. కాగా, వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్‌లో శీతల్‌కు ఇదే తొలి వ్యక్తిగత స్వర్ణ పతకం. మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనూ శీతల్ పతకం ముద్దాడింది. ఆమె తోమన్ కుమార్‌తో కలిసి కాంస్య పతకం సాధించింది. కాంస్య పతక పోరులో ఈ భారత ద్వయం 157-145 తేడాతో ఇరాక్ జోడీ సారా అల్-హమీద్?ను ఓడించింది. ఇక పారా రికర్వ్ మహిళల వ్యక్తిగత విభాగంలో భావన కాంస్యం నెగ్గింది. ఆమె భారత్‌కే చెందిన రాజశ్రీ రాథోడ్‌ను 6- 0 తేడాతో ఓడించి కాంస్య పతకం అందుకుంది. పారా కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో సరిత 141- 140 తేడాతో చైనా షూటర్ వాంగ్ హ్యుటింగ్‌పై నెగ్గి కాంస్య పతకం ముద్దాడింది. పారా కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత విభాగంలో తోమన్ కుమార్ 143-138 తేడాతో ఇరాక్? పారాఅథ్లెట్ అబ్బాస్ కాధిమ్‌పై నెగ్గి కాంస్య పతకం గెలిచాడు. మరోవైపు, రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో రెండుసార్లు పారాలింపిక్స్ మెడల్ విన్నర్ హర్విందర్ సింగ్-భావన 6-0 తేడాతో చైనా జోడీ లియాంగ్ కియురోంగ్-షియా లేపై నెగ్గి గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. కాగా, ఈ వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ 2026 స్టేజ్ 3ను భారత్ మొత్తం 15 పతకాలతో ముగించింది. ఇందులో నాలుగు స్వర్ణాలు, మూడు రజతాలు, ఎనిమిది కాంస్యాలు ఉన్నాయి.





# సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన

## స్వగత కృష్ణన్ ఇన్స్టాగ్రామ్ పోస్ట్

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన ఇన్స్టాగ్రామ్ స్టోరీ ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పేరు ప్రస్తావించకుండా ఒక ప్రముఖ సంగీత దర్శకుడిపై ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సదరు వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ మరియు బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డాడని, అయినా ఇండస్ట్రీ అతని వెంటే నిలవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఓ స్టూడియోలో తనకు ఎదురైన లైంగిక వేధింపులు, సౌండ్ ప్రూఫ్ గదిలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన ఉదంతాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ కారణాల వల్లనే తాను చెన్నై వదిలి రుషికేష్ వెళ్ళినట్లు తెలిపారు. తీవ్ర ఆరోపణలు ఉన్నప్పటికీ సదరు వ్యక్తికి సినీ పరిశ్రమలో గౌరవం, మద్దతు లభించడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, అతడు ప్రస్తుతం ఒక భక్తిరస చిత్రానికి సంగీతం అందిస్తున్నాడని, బహిరంగ వేదికలపై సన్మానాలు పొందుతున్నాడని పేర్కొంటూ ఇండస్ట్రీ ఎవరి పక్షాన నిలుస్తోందని ప్రశ్నించారు. "నెక్స్ట్.." అంటూ తన పోస్ట్‌ను ముగించడంతో, త్వరలోనే ఆమె మరిన్ని విషయాలను, ఆధారాలను బయటపెట్టబోతున్నారా అనే ఉత్కంఠ నెటిజన్లలో నెలకొంది.

# అతన్ని ప్రేమించిమోసపోయా..

విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మీ. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మీ.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్ చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పౌలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సత్యదేవ్ హీరోగా వచ్చిన గాడ్సే మూవీ ద్వారా తెలుగు వారిని పలకరించారు ఐశ్వర్య లక్ష్మీ. ఈ ఏడాది తమిళంలో గట్టా కుస్తీ 2 సినిమాతో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం సాయిధరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు, మలయాళంలో ఆశా సినిమాలలో ఆమె నటిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఐశ్వర్య.. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. 35 ఏళ్లు దాటి 40వైపు చేరుకుంటున్నా ఇంకా పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గానే ఎంజాయ్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ. పలుమార్లు ఐశ్వర్య లక్ష్మీ ప్రేమలో పడినట్లుగా రూమర్స్ రాగా.. వాటిని ఆమె ఖండించారు. నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను.. నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించొద్దని ఫ్యాన్స్‌పై విరుచుకుపడింది ఐశ్వర్య. జీవితంలో నేను పెళ్లి చేసుకోను.. ఎంతోమంది సన్నిహితులను చాలా దగ్గరి నుంచి చూశా. పెళ్లి కారణంగా కలల్ని చంపుకుని, వ్యక్తిగతంగానూ వారు ఎదగలేకపోతున్నారు. ఇవన్నీ చూసి, ఆలోచించి జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. సంతోషకరమైన జీవితాన్ని గడపటానికి పెళ్లి అనేది తప్పనిసరి కాదు. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే, సహజీవనం బెస్ట్ అని ఐశ్వర్య లక్ష్మీ బోల్డ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి, ప్రేమపై ఐశ్వర్య లక్ష్మీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను గతంలో ఓ రిలేషన్‌లో మోసపోయా, స్వతహాగా నేను ఆకర్షణలకు లొంగను, అలాంటి ఓ వ్యక్తిని పూర్తి నమ్మి అతని చేతిలో మోసపోయా. ఈ రిలేషన్ ముగిసిన తర్వాతే నా చుట్టూ ఏం జరుగుతుందో తెలుస్తోంది. ఓ మహిళ నన్ను కలిసిన తర్వాతే అతని మోసం బయటపడింది. ఇందులో తన తప్పు లేకపోవడం వల్లే ఆమెపై నాకెలాంటి కోపం రాలేదు. ఈ విషయం గురించి రెండు రోజులు మాత్రమే బాధపడ్డా.. ఆ తర్వాత దానిని మరిచిపోయానని ఐశ్వర్య లక్ష్మీ పేర్కొన్నారు.



# ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మూవీ మందాడి



సూరి, సుహాస్ మెయిన్ లీడ్స్ గా తెరకెక్కిన తమిళ్ సినిమా 'మండాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మాణంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్.. పలువురు కీలక పాత్రలను పోషించారు. మండాడి సినిమా నేడు సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో రిలీజ్ అయింది. కళింగపట్నంను సట్టపులి(సుహాస్) రూల్ చేస్తూ ఉంటాడు. ఆ ఊళ్ళో సముద్రంలో జరిగే పడవపోటీలు ఎన్నో ఏళ్లుగా చాలా ఫేమస్. 20 ఏళ్లుగా సట్టపులి సునామి రైడర్స్ టీమ్ తో ఆ ఊరిని గెలిపిస్తూ ఉంటాడు. శ్రీను(రవీంద్ర విజయ్) కొడుకు మల్లేష్(మిథున్ జై శంకర్) పడవల పోటీకి సంబంధించిన ఓ విషయంలో గొడవ జరిగి సట్టపులి కొడుకుపై దాడి చేస్తాడు. అది మిస్ అవ్వడంతో ఓ అమ్మాయి సాయంతో హైదరాబాద్ లో ఉన్న ముత్తు కాళీ(సూరి) దగ్గర తలదాచుకుని ఉంటాడు. ముత్తుకాళీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటూ ఓ స్విమ్మింగ్ పూల్ లో పనిచేస్తూ ఉంటాడు. కానీ సట్టపులి మనుషులు మల్లేష్ ని చంపడానికి అక్కడికి కూడా రావడంతో 20 ఏళ్లుగా ఊరికి వెళ్లని ముత్తుకాళీ మల్లేష్ ని తీసుకొని ఊరికి వస్తాడు. అక్కడ పెద్దలు సట్టపులికి ముత్తుకాళీ మధ్య రాజి కుదర్చాలని ట్రై చేసినా అక్కడ పెద్ద గొడవ అవుతుంది. దాంతో కళింగపట్నం నుంచి రెండు టీమ్స్ పోటీ చేయాలి ఎవరు ఓడిపోతే వాళ్ళు ఆటని వదిలేయాలి అని నిర్ణయిస్తారు. పోటీకి కొన్ని రోజులు సమయం ఉండటంతో కొత్తవాళ్లకు ముత్తుకాళీ తన కళింగ వారియర్స్ టీమ్ గా ట్రైనింగ్ ఇస్తూ ఉంటాడు. సట్టపులి, అతని కొడుకు పోటీ ఎలాగైనా గెలవాలని కుట్రలు పన్నుతూ ఉంటారు. ఓ ప్రాక్టీస్ మ్యాచ్ లో ముత్తుకాళీ టీమ్ పడవ బోల్తా పడి పోటీలో ఉన్నవాళ్లు హాస్పిటల్ పాలవుతారు. దీంతో కళింగ వారియర్స్ కి పోటీల్లో ఎలా పాల్గొనాలో అర్థం కాదు. మరోవైపు 20 ఏళ్ళ క్రితం ముత్తుకాళీ ఒకప్పుడు తన తల్లి ఏంజిల్ (మహిమా నంబియార్)ని ప్రేమించిన వ్యక్తి అని తెలిసి మల్లేష్ ముత్తుకాళీ పై కోపంగా ఉంటాడు. అసలు 20 ఏళ్ళ క్రితం ఆ ఊళ్ళో ఏం జరిగింది? బెస్ట్ ఫ్రెండ్స్ గా ఉండే సట్టపులి -- ముత్తుకాళీ శత్రువులు ఎలా అయ్యారు? ఏంజిల్ -- ముత్తుకాళీ ప్రేమ ఎందుకు విఫలమైంది? పోటీలో గెలవడానికి సట్టపులి చేసే కుట్రలు ఏంటి? ఫైనల్ పోటీలో ముత్తుకాళీ టీమ్ గెలుస్తుందా? సముద్రంలో జరిగే సంఘటనలు ఏంటి.. ఇవన్నీ తెలియాలంటే తెరపై చూడాల్సిందే.

# 'సీక్రెట్ సోల్జర్' నుంచి సాంగ్ రిలీజ్




నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా తెరకెక్కుతున్న సినిమా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో స్పై డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్.. పలువురు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజయిన సాంగ్స్, టీజర్, ట్రైలర్స్ అంచనాలు పెంచగా తాజాగా ఈ సినిమా నుంచి ఓయ్ ఓయ్.. అంటూ సాగే సాంగ్ ని రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీత దర్శకత్వం అందిస్తూ రెహమాన్ రాసిన ఈ సాంగ్ ని కార్తీక్ స్వయంగా పాడాడు. ఈ సినిమా సెప్టెంబర్ 18న థియేటర్స్ లో రిలీజ్ కానుంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**